thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 24 | కరీంనగర్ | శుక్రవారం | 10 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

**సూపర్ ఛేజింగ్: నైట్ రైడర్స్ పై లక్నో గెలుపు**



11



# కాళేశ్వరం బ్యారేజీలు సిద్ధం కావాలి

## నిధులకు కొరత లేదు: సీఎం రేవంత్ రెడ్డి

- నేనే స్వయంగా మేడిగడ్డకు వస్తా..
- బేస్ క్యాంప్ ఏర్పాటు చేయండి
- డిసెంబర్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే..
- అధికారులకు ముఖ్యమంత్రి అల్టిమేటం



కుంగిన పిల్లర్లు.. పగుళ్లు తేలిన నిర్మాణాలు.. ప్రశ్నార్థకంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు భవితవ్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేశారు. అందరూ ఊహించినట్టుగా కేవలం నివేదికలతో కాలక్షేపం చేయకుండా, క్షేత్రస్థాయిలో అసలేం జరిగిందో తేల్చేందుకు ఆయన సిద్ధమయ్యారు. గురువారం రాత్రి జూబ్లీహిల్స్ నివాసంలో జరిగిన హై-వోల్టేజ్ సమీక్షా సమావేశంలో సీఎం తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతున్నాయి.

**హైదరాబాద్, ఏప్రిల్ 10:** 'కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల విషయంలో జాప్యాన్ని అస్సలు సహించేది లేదు. తక్షణమే వాటిని వినియోగంలోకి తీసుకురావడమే మన లక్ష్యం' అని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నీటిపారుదల శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం దిశానిర్దేశం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణ కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తామని, పనిలో మాత్రం నాణ్యత, వేగం ఉండాలని అధికారులను హెచ్చరించారు.

మిగతా 2 లో

# కేసీఆర్‌తో కలిసి పని చేస్తా

### 27 నెలలుగా పార్టీలో క్షోభ అనుభవించా

### అవమానాలు భరించలేకే ఈ నిర్ణయం

- కాంగ్రెస్ పాలన చూశాక బీఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు
- రేవంత్ కన్నా.. కేసీఆర్ పాలనే బెటర్
- మాజీమంత్రి జీవన్‌రెడ్డి ఆవేదన



రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు.

వివరాలు 2వ పేజీలో



2

# వరి కొనుగోలు గడువు 2 నెలలు పెంచాలి

**బాయిల్డ్ రైస్ టార్గెట్ పెంచకపోతే రైతులకు ఇబ్బందే..**

**కేంద్రానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ**

వరి కొనుగోలు గడువును మరో రెండు నెలల పాటు పెంచాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. ఇప్పటికే గడువు ముగిసిన క్రమంలో, పెండింగ్‌లో ఉన్న 8.45 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం డెలివరీ కోసం అదనపు సమయం కావాలని ఆయన డిమాండ్ చేశారు.

# జూన్ 2 నుంచి అల్పాహారం

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- డిప్యూటీ సీఎం భట్టి
- రాష్ట్రవ్యాప్తంగా వంద యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు

2





2

## ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు

**వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు**

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

4



పుదుచ్చేరిలో అత్యధికంగా 86.92 శాతం నమోదు.

# పొంగులేటి కాదు.. పొంగులూటీ

- బాంబులు పేలుతాయన్న బాంబులేటి
- అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు
- క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు
- నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే.. హైడ్రా ఎందుకు వెళ్లలేదు
- గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం

3





## ఇరాన్ చుట్టూ బలగాల పహారా

కాల్పుల విరమణ తాత్కాలికమే..

ఉల్లంఘిస్తే మునుపెన్నడూ లేరీతిలో దాడి : ట్రంప్

4

# బెంగాల్‌లో మార్పు ఖాయం..

- మళ్లీ అదే రిపీట్ అవుద్ది: మోదీ
- టీఎంసీ సర్కారుకు వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది
- హల్దియా ప్రచారంలో దీదీ సర్కారుపై ప్రధాని నిప్పులు

4





2

## అంగన్‌వాడీ టీచర్‌పై అఘాయిత్యం

చెట్టుకు కట్టేసిన కొట్టిన ఐదుగురి అరెస్ట్



# ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు

## వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 9:** తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది. గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 – ఏప్రిల్ 22, 2016 – ఏప్రిల్ 22, 2017 – ఏప్రిల్ 16, 2018 – ఏప్రిల్ 13, 2019 –ఏప్రిల్ 18, 2020 – జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021–జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 – జూన్ 28, 2023 – మే 9, 2024 – ఏప్రిల్ 24, 2025 –ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము. సామాజిక మాధ్యమాలలో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మ వద్దని తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ పేర్కొంది.

# శంషాబాద్‌లో డ్రగ్స్ స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 9:** గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ డ్రగ్స్ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. ఈగల్ టీం, పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో తరచూ డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్ పోర్టులో మరోసారి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు కస్టమ్స్ అధికారులు. గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో రూ. 4.6 కోట్ల విలువ చేసే 13.2 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి థాయ్ ఎయిర్ వేస్ ఫ్లైట్ లో వచ్చిన ప్రయాణికుడి బ్యాగ్ తనిఖీ చేయగా గంజా లభ్యమైనట్లు తెలిపారు అధికారులు. అతడి నుంచి 13.2 కిలోల హైడ్రోఫోనిక్ గంజా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు అధికారులు.ప్రయాణికుడితో పాటు డ్రగ్స్ నెట్వర్క్ నిర్వహిస్తున్న మరో నిందితుడిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు కస్టమ్స్ అధికారులు. 2025–26 సంవత్సరంలో మొత్తం 160 కిలోల హైడ్రోఫోనిక్ గంజా స్వాధీనం చేసుకొని 30 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు కస్టమ్స్ అధికారులు.

# అంగన్‌వాడీ టీచర్‌పై అఘాయిత్యం

## చెట్టుకు కట్టేసిన కొట్టిన ఐదుగురి అరెస్ట్

**సంగారెడ్డి, ఏప్రిల్ 9:** సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం రాసోల్ గ్రామంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. అంగన్‌వాడీ టీచర్ వసంత కుమారిని ఈడ్చుకెళ్లి చెట్టుకు కట్టేసి కొట్టారు గ్రామస్తులు. జుట్టు కత్తిరించి గాడిదాపై ఉరేగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. వద్దని ప్రాధేయపడ్డా కూడా కనికరించకుండా గ్రామస్తులు దారుణంగా వ్యవహరించారు. గంటకు పైగా అంగన్ వాడీ టీచర్ ను చిత్రహింసలకు గురిచేసినట్లు తెలిపారు. దీనికి గల కారణం ఏంటంటే.. అంగన్ వాడీ టీచర్ భర్త ఇన్సూరెన్స్ డబ్బులను గ్రామస్థుల నుంచి వసూలు చేసి తిరిగి ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. భర్తపై ఉన్న కోపంతో సంబంధం లేని మహిళపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు గ్రామస్తులు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# వరి కొనుగోలు గడవు పెంచాలి

## కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 9:** వరి కొనుగోలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాసారు. ఈ సీజన్‌లో మరో రెండు నెలల గడవు పెంచాలని కోరారు. రబి 2024–25కు 5 లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ టార్గెట్ పెట్టాలని..ఎఫ్‌సీఐ రా రైస్ టార్గెట్ తగ్గించాలని సూచించారు మంత్రి ఉత్తమ్. 8.45 లక్ష మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ ఇంకా పెండింగ్ ఉందని.. ఇప్పటికే గడువు ముగిసిన క్రమంలో మరో 60 రోజులు గడువు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఐదు శాతం బ్రోకెన్స్‌తో బాయిల్డ్ రైస్ సరఫరాకు మిల్లర్ల అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. 2025–26కు బాయిల్డ్ రైస్ టార్గెట్ 20 నుంచి 40 ఒక్కులకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తికి సరిపడా టార్గెట్లు లేవని రాష్ట్రం ఆందోళనలో ఉందని అన్నారు. కేంద్రం టార్గెట్లు తగ్గించడంతో నిల్వలు పెరుగుతున్నాయని.. రైతులకు భరోసా కల్పించేందుకు నిరంతర కొనుగోలు అవసరం ఉందని.. అదనపు ప్యాడీతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.మరో 2 నెలల గడువు పెంచాలని కోరారు.

# సామూహిక అత్యాచారం.. హత్య

## ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

**వరంగల్, ఏప్రిల్ 9:** రాయపర్తి మండలంలో సామూహిక హత్యాచారం తీవ్ర కలకలం రేపింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై నలుగురు యువకులు హత్యాచారానికి పాల్పడ్డారు. తమ కుమార్తె(21)పై బుధవారం రాత్రి రావూరు తండాకి చెందిన నలుగురు అత్యాచారం చేశారని యువతి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత అత్యంత పాశవికంగా ఆమెను చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను ఉరి వేసి చంపేశారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. బాధితురాలు తీవ్ర రక్త స్రావంతో మృతిచెందిందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వర్ధన్నపేటలో మార్చురీ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కాళేశ్వరం బ్యారేజీలు వెంటనే సిద్ధం కావాలి

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మూడు బ్యారేజీలను త్వరితగతిన పునరుద్ధరించి, తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చేసిన సిఫార్సుల ప్రకారం మరమ్మతు పనులను వేగవంతం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, నిర్మాణ సంస్థలు మరియు డిజైన్ కన్సల్టెంట్లతో కూడిన సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేయాలి. ప్రతి దశలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ప్రతినిధులను భాగస్వాములను చేయాలి" అని ఆయన ఆదేశించారు.

## మేడిగడ్డ వద్ద స్పెషల్ యాక్షన్ ప్లాన్

కేవలం కుంగిన పిల్లర్ మాత్రమే కాకుండా, మేడిగడ్డ బ్యారేజీలోని 1.6 కిలోమీటర్ల మేర ఉన్న మొత్తం నిర్మాణాన్ని లోతుగా అధ్యయనం చేయాలని ఇంజనీర్లు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి, మేడిగడ్డ వద్ద 500 బోర్ వెల్స్ వేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన యంత్రాలను తక్షణమే సమకూర్చాలని చెప్పారు. పనుల పర్యవేక్షణ కోసం మేడిగడ్డ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు చేయాలని, పనులు ప్రారంభమైన తర్వాత తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని తెలిపారు.



## డిసెంబర్ నాటికి లక్ష్యం

బ్యారేజీల మరమ్మతు డిజైన్లను ఖరారు చేసి, డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేసేలా సమగ్ర షెడ్యూల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణకు నిధుల కొరత లేదని, నాణ్యతతో కూడిన పనులను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ఉదయం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ఉదయం 10 గంటలకు శంషాబాద్ విమానాశ్ర యం నుంచి బయలుదేరు తారు. సీఎంతో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు దామో దర రాజ నర్సింహ, ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా వెళ్లే అవకాశం ఉంది.

# కేసీఆర్‌తో కలిసి రాష్ట్రం కోసం పనిచేస్తా

- 27 నెలలుగా పార్టీలో క్షోభ అనుభవించా
- అవమానాలు భరించలేకే ఈ నిర్ణయం
- కాంగ్రెస్ పాలన చూశాక బీఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు
- రేవంత్ కన్నా.. కేసీఆర్ పాలనే బెటర్
- మాజీమంత్రి జీవన్‌రెడ్డి ఆవేదన



**జగిత్యాల, ఏప్రిల్ 9:** తాను భారత రాష్ట్ర సమితిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. తన శేష జీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే.. రాష్ట్ర భవిష్యత్‌కు పాటుపడవచ్చని అన్నారు. 27 నెలలుగా చాలా క్షోభ అనుభవించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసినప్పుడు.. భావోద్వేగానికి గురయ్యాను. బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తారని కాంగ్రెస్‌కు ఓటేశారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో నడిచింది. 2014లోనే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం వచ్చింది. కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినా.. కాంగ్రెస్‌లోనే కొనసాగా. రాష్ట్ర అవసరాల కోసం ఇప్పుడు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తా అని జీవన్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ తన ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్‌లో చేరుతానని వెల్లడించారు జీవన్ రెడ్డి. తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు కేసీఆర్, కేటీఆర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం భావోద్వేగానికి గురి చేసిందని.. ఇవాళ బీఆర్ఎస్ తో కలవడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టానని అన్నారు. ఎందరి ప్రభుత్వాలో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉందని అన్నారు జీవన్ రెడ్డి. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని..కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. కేసీఆర్, జీవన్ రెడ్డి మధ్య నాలుగు దశాబ్దాలకుపైగా స్నేహం ఉంది. గతంలోనూ ఆయన్ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించాం. కాంగ్రెస్‌తో అనుబంధం వల్ల జీవన్‌రెడ్డి గతంలో పార్టీ మారలేదు. ఇప్పుడు మరోసారి జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించాం. రెండ్రోజుల్లో కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలుస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసుగు చెందారు. రైతులకు రూ.27 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారు. హామీలు అమలు చేయకుండా అనవసర మాటలు మాట్లాడుతున్నారు. ఇదిలావుంటే సీఎం రేవంత్ రెడ్డి భాషపై జనాల్లో చర్చ జరుగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.

# జూన్ 2 నుంచి విద్యార్థులకు అల్పాహారం

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం: డిప్యూటీ సీఎం భట్టి
- రాష్ట్రవ్యాప్తంగా వంద యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు



**ఖమ్మం, ఏప్రిల్ 9:** గత పదేళ్లలో వనరుల దోపిడీ వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. విద్య ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు పోషకాహారం

జూన్ 2వ తేదీ నుంచి పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో వంద యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందని చెప్పారు.

## సాగునీటి ప్రాజెక్టుల పూర్తి

మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించడమే తన సంకల్పమని వెల్లడించారు. 36 కోట్ల రూపాయలతో కట్టలేరు కాలువల మరమ్మతులు చేపట్టామన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలోని భూములను రెండవ జోన్ కిందకు తెచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరందిస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్టును గాలికొదిలేశారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు పూర్తి చేయిస్తోందని స్పష్టం చేశారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# నల్లగొండలో నకిలీ నోట్ల వ్యాపారం

## మాటువేసి దుండుగుడి పట్టివేత

**నల్లగొండ, ఏప్రిల్ 9:** కష్టపడకుండానే, ఏ పని చేయకుండానే సంపాదించాలనే ధోరణితో కొందరు కేటుగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. కొందరు పెట్టుబడుల పేరుతో, ఆన్‌లైన్ బెట్టింగ్ పేరుతో మోసం చేస్తుంటే.. ఈ కేటుగాడు లక్ష అసలుకు 5 లక్షల దొంగనోట్లు ఇస్తానని చెప్పి సామాన్యులను మోసం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లాలో నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నకిలీ కరెన్సీతో మోసం చేసిన నిందితుడిని తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అమాయకులను టార్గెట్ చేసి నకిలీ 500 నోట్లతో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని నేరాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. లక్ష రూపాయల అసలు కరెన్సీకి 5 లక్షల నోట్ల ఆఫర్ పేరుతో మోసం చేసినట్లు చెప్పారు. నల్ల కాగితాన్ని కెమికల్‌తో అసలు నోట్లలా చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. నోట్ల కట్టలలో పైభాగంలో ఒరిజినల్ నోట్లు లోపల నల్ల కాగితాల కట్టలతో చూపించి మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మల్లేపల్లి వారిగూడేనికి చెందిన వంగూరి జానయ్య మోసానికి గురవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. ట్రాప్ వేసి తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బ్లాక్ కలర్ కాగిత కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌మీ మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సల్మాన్ ఉమా డాలియా అలియాస్ గోయిట సోంగలో అనే వెస్ట్ ఆఫ్రికా, మాలి దేశానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చిన నిందితుడు బెంగళూరులో నివసిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. నకిలీ కరెన్సీ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ వి. శంకర్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.



# పొంగులేటి కాదు.. పొంగులూటీ

- బాంబులు పేలుతాయన్న బాంబులేటి
- అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు
- క్రషర్ అవినీతిని సీఎం స్వయంగా చెప్పారు
- నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే .. హైడ్రా ఎందుకు వెళ్లలేదు
- గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం



**వనపర్తి, ఏప్రిల్ 9:** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసలు పేరు పొంగులేటి కాదు.. ఆయన 'పొంగులూటీ', 'బాంబులేటి' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో పర్యటించిన ఆయన.. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన తెలుపుతున్న రైతులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో కూర్చొని మంత్రి నిజాలు దాచి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాటలు వింటే ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్థమవుతోందని, గత ఏడాది కాలంగా బాంబులు పడతాయని ఆయన చెబుతున్న మాటలు తుస్సుమన్నాయని సెటైర్లు వేశారు. ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు.

### సొంత కంపెనీ అవినీతిపై నిలదీత

రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అనే సొంత కంపెనీలో జరిగిన అవినీతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా అసెంబ్లీలో బయటపెట్టారని హరీశ్ రావు గుర్తు చేశారు. అనుమతులు లేకుండా కంపెనీ నడుపుతున్నారని అధికారులు నోటీసులు కూడా ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. లేక పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తాము లేవనెత్తిన తర్వాతే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్ పై రంగు వేసి కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయటపెట్టారని ఎద్దేవా చేశారు.

### హైడ్రా తీరుపై సవాల్

కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను రక్షించామని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఆ భూములు ప్రభుత్వానివి అని కోర్టులో తేలినా వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని నిలదీశారు. అవి ప్రభుత్వ భూములైతే ఆక్రమణ దారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదల ఇళ్లపైకే హైడ్రా వెళ్తుందా అని అడిగారు. కాంపౌండ్ వాల్ కూలగొట్టి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

# బహదూర్‌పల్లిలో భారీ అగ్నిప్రమాదం

### డెకరేషన్ స్క్రాప్ గోదాంలో ఎగిసిపడ్డ మంటలు

### అపార్ట్‌మెంట్ వాహనాలకూ వ్యాపించిన అగ్నికీలలు



**మేడ్చల్, ఏప్రిల్ 9:** మేడ్చల్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దుండిగల్ పరిధి బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని డెకరేషన్ స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసిన వాహనాలకు కూడా మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదం కారణంగా కాలనీలో దట్టమైన పొగ వ్యాపించింది. ఎగిసిపడుతున్న మంటలు, కమ్మేసిన పొగతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసేందుకు కృషి చేశారు. సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో పెద్ద ముప్పు తప్పింది. మరోవైపు జీడిమెట్ల పారిశ్రామిక వాడలోనూ భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది అక్కడ కూడా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# మోడల్ కారిడార్‌తో ట్రాఫిక్ కష్టాలకు చెక్

- షేక్‌పేట - మాసాబ్ ట్యాంక్ మధ్య అధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- నగర ట్రాఫిక్ పనుల కోసం 120 కోట్ల రూపాయల కేటాయింపు



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (మనసులో మాట):** భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీ హెచ్ ఎం సీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ మార్గమధ్యంలో ఉన్న బాటిల్ నెక్ లు, నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు.

### కొత్త వంతెనలు, సిగ్నళ్లు

ఎస్ డీ ఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్ 1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఏన్ ఎం డీ సీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు.

### ఆక్రమణల తొలగింపు


రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.

### భారీ నిధుల కేటాయింపు

ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు 20 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 120 కోట్లు కేటాయిస్తున్నామని జీ హెచ్ ఎం సీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీ. జోయల్ డెవిస్, జీ. ముకుంద రెడ్డి, ప్రియాంక ఆలా, కాజల్, కే. శ్రీనివాస్, ఎస్. రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, డీ. ధనలక్ష్మి పాల్గొన్నారు.

# మరో 3 డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు

- ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక
- వారం రోజులు పొడి వాతావరణమే: వాతావరణ శాఖ




**హైదరాబాద్, ఏప్రిల్ 9:** తెలంగాణలో ఎండలు తీవ్రమవుతున్నాయని, ఉష్ణోగ్రతలు మరో మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గురువారం ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఉదయం పది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావంతో వచ్చే వారం పొడి వాతావరణమే ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఈసారి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఎండల తీవ్రత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో అత్యధికంగా 41.6 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. నల్లగొండ జిల్లా నేరడుగొమ్మ, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో కూడా ఎండలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు.

# రేవంత్‌ను ఓడించడమే ధ్యేయం అనడం సరికాదు

### జీవన్ రెడ్డి తీరుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం

### ఓడినా గౌరవం ఇచ్చినా విమర్శలు చేయడం అన్యాయమని మండిపాటు




**హైదరాబాద్, ఏప్రిల్ 9:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓడించడమే తన ధ్యేయమని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అనడం ఏమాత్రం సరికాదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. తాను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్తానని చెబుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేయడంపై మండిపడ్డారు. గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ జీవన్ రెడ్డి ఎన్నికల్లో ఓడిన పది నిమిషాలకే రేవంత్ రెడ్డి స్వయంగా ఫోన్ చేశారని గుర్తుచేశారు. ఆ సమయంలో ఆయనకు మంత్రి పదవి ఇస్తామని కూడా హామీ ఇచ్చారని వెల్లడించారు.

### కాంగ్రెస్‌లో సమున్నత గౌరవం

జీవన్ రెడ్డి ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఆయనను ఎంతో గౌరవించిందని మంత్రి పేర్కొన్నారు. ఓడిన వారికి మంత్రి పదవి ఇవ్వకూడదన్న ఏఐసీసీ నిబంధన వల్లనే అది సాధ్యం కాలేదని వివరించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ 14 సార్లు బీఫామ్ ఇచ్చిందని తెలిపారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయన అనడం సరికాదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందని చెప్పారు. పార్టీకి ఎంతో చేసిన నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు.

# బిల్లు కోసం లంచం..

### ఏసీబీకి చిక్కిన అటవీ అధికారులు

### 15 వేల రూపాయలు తీసుకుంటూ దొరికిపోయిన జూనియర్ అసిస్టెంట్

### ఎఫ్ఆర్ఓ ఆదేశాలతోనే వసూలు.. ఇద్దరూ కస్టడీలోకి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 9 :** చెక్ డ్యాం బిల్లుల మంజూరు కోసం 15 వేల రూపాయల లంచం తీసుకుంటూ బోథ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి, జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు చిక్కారు. హరితహారంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన చెక్ డ్యాంకు సంబంధించి సుమారు 5 లక్షల రూపాయల బిల్లు పెండింగ్‌లో ఉంది. ఈ డబ్బుల కోసం బాధితుడు అధికారుల చుట్టూ తిరగగా.. ఎఫ్ఆర్ఓ టి. ప్రణయ్ లంచం డిమాండ్ చేశాడు. ఎఫ్ఆర్ఓ సూచనతో బాధితుడు జూనియర్ అసిస్టెంట్ పరశురాంకు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. విచారణలో ఎఫ్ఆర్ఓ ఆదేశాల మేరకే తాను డబ్బు తీసుకున్నట్లు పరశురాం అంగీకరించాడు. దీంతో అధికారులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అవినీతికి పాల్పడిన ఇద్దరు అధికారులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ బిల్లుల విడుదల కోసం లంచం ఆశించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# భూ విచారణ కోసం లంచం..

### ఏసీబీ వలలో ఆర్ఐ

### 10 వేల రూపాయలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ శ్రీమాన్

### అంతర్గాం తహసీల్ కార్యాలయంలో కరీంనగర్ అధికారుల దాడి

**పెద్దపల్లి, ఏప్రిల్ 9:** భూమికి సంబంధించిన క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించేందుకు లంచం తీసుకుంటూ అంతర్గాం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సెదంక శ్రీమాన్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. భూభారతి చట్టం, 2025 ప్రకారం ఫిర్యాదుదారు తల్లికి చెందిన భూమికి సంబంధించి నివేదికను తహసీల్దార్‌కు పంపించాలని బాధితుడు కోరారు. ఇందుకు ప్రతిఫలంగా ఆర్ఐ లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

### తహసీల్ కార్యాలయంలో పట్టివేత

గురువారం తహసీల్ కార్యాలయంలో బాధితుడి నుంచి 10 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా కరీంనగర్ యూనిట్‌కు చెందిన ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు. విధుల్లో అవినీతికి పాల్పడి లంచం ఆశించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# యూనిఫాం - అవినీతి కలిసి ఉండలేవు

- అక్రమార్కులకు డీజీపీ శివధర్ రెడ్డి గట్టి హెచ్చరిక




**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** "యూనిఫాం, అవినీతి రెండూ కలిసి ఉండలేవు.. శాంతి భద్రతలను కాపాడాల్సిన వారు అక్రమ సంపాదనకు అలవాటు పడితే కఠిన చర్యలు తప్పవు" అని రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసు సిబ్బందిని హెచ్చరించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన రాసిన లేఖలో నిబద్ధత, పారదర్శకతతో పనిచేయాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే పేదలు, బలహీన వర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించి న్యాయం చేయాలని ఉద్ఘాటించారు. స్టేషన్లను సివిల్ సెటిల్మెంట్లకు వేదికగా మార్చవద్దని కుండబద్దలు కొట్టారు. డీజీపీ ఆదేశాలు కఠినంగా ఉన్నా క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు పాత పద్ధతులు మార్చుకోవడం లేదు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా పర్యవేక్షణలో అవినీతి నిరోధక శాఖ దాడులు ముమ్మరం చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ అవుట్‌పోస్టు ఇన్‌స్పెక్టర్ సంపాతి కనకయ్య, ఎస్సై సిద్ధేశ్వర్ ఓ కేసులో చార్జ్ షీట్ దాఖలు చేసేందుకు ఐదు లక్షల లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రెండు లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నివాసంలో సోదాలు చేయగా 33,97,000 నగదు లభించడం కలకలం రేపింది. అలాగే మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పీఎస్‌లో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష రూపాయల లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అవినీతి జాడ్యం జిల్లాల్లోనూ కొనసాగుతోంది. నిర్మల్ జిల్లా మామడ ఎస్సై అశోక్ 20 వేలు, మాదాపూర్ ఎస్సై వినయ్ 50 వేలు, వరంగల్ కేయూసీ ఎస్సై శ్రీకాంత్ 15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని ములుగు ఎస్సై విజయ్ కుమార్ 50 వేలు, మెదక్ జిల్లా టేక్మల్ ఎస్సై రాజేష్ 30 వేలు తీసుకుంటూ దొరికిపోయారు. టేక్మల్ ఎస్సై అధికారులను చూసి పొలాల్లోకి పారిపోగా వెంటాడి పట్టుకున్నారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీజీ ప్రజలను కోరారు.



సంపాదకీయం

# ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు!

ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మ్యూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మ్యూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷– నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు హర్మ్యూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే హర్మ్యూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణమైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# పాక్‌ను ముందు పెట్టి అమెరికా నాటకం

- హర్మ్యూజ్ తెరుచుకునేలా కాల్పుల విరమణ
- లెబనాన్‌పై దాడులతో మళ్లీ పీటముడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: 40 రోజుల పాటు కొనసాగిన యుద్ధానికి తెర దించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య రాజీ కుదిరింది. రెండు దేశాల మధ్య రాజీ కుదర్చటాన్ని పాకిస్థాన్ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. తనను తాను శాంతిదూతగా చెప్పుకుంటోంది. ఇలాంటి సమయంలో బ్రిటన్‌కు చెందిన ది ఫైనాన్షియల్ టైమ్స్ న్యూస్ పేపర్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. అమెరికా ఒత్తిడి కారణంగానే పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వచ్చింది. ఇరాన్, అమెరికాల మధ్య రాజీ కుదిరితే హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకుంటుందని అమెరికా భావించింది. అందుకే ఇరాన్‌ను యుద్ధం ఆపేలా ఒప్పించమని పాకిస్థాన్‌ను కోరింది. గత కొన్ని వారాల నుంచి ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికా ఒత్తిడి కారణంగానే బలవంతంగా ఇరాన్‌తో చర్చలకు పాకిస్థాన్ ఒప్పుకుంది. ఎంతో కష్టం మీద ఇరాన్‌ను రాజీకి ఒప్పించింది. అమెరికాకు సంబంధించినంత వరకు పాకిస్థాన్ మధ్యవర్తి కాదు.. ఇరాన్‌తో సంధి చేసుకోవడానికి ఓ మార్గం మాత్రమేనని ది ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఇజ్రాయెల్ కారణంగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విఫలం అయ్యేలా ఉంది. ఇజ్రాయెల్ లెబనాన్‌పై మిస్సైల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసి వేసింది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ది ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. 'అమెరికా ఈజ్ బ్యాక్. ఇప్పటికే బలహీనపడిన శత్రువును పూర్తిగా నిర్మూలించేందుకు సిద్ధంగా ఉన్నాం. హోర్ముజ్‌ను తెరవకపోతే దాడులు తప్పవు. ఒప్పందం కుదరకపోతే ఈసారి తీవ్రమైన దాడులు చేస్తాం. ఎన్నడూ లేని విధంగా ఇరాన్‌పై విరుచుకుపడతాం. ఇప్పటికే ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలున్నాయి. అణ్వాయుధాలను ఇరాన్ వదలాల్సిందేనని రాసుకొచ్చారు. అయితే ఇరాన్ కూడా పట్టుదలగానే ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ మరోసారి హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. అమెరికా, ఇరాన్‌లు బుధవారం రెండు వారాల కాల్పుల విరమణను ప్రకటించాయి. దీనిలో భాగంగా, ప్రపంచ ఇంధన సరఫరాలను పునరుద్ధరించేందుకు వీలుగా హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. అమెరికా తీసుకున్న నిర్ణయానికి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మద్దతు తెలిపారు. అయితే లెబనాన్‌తో కాల్పుల విరమణ ఉండదని చెప్పారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. పది నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై సుమారు 100 ఎయిర్ స్ట్రైక్స్ చేసింది. ఈ దాడుల్లో దాదాపు 180 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. 837 మంది గాయాల పాలయ్యారు. 1982 తర్వాత లెబనాన్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదే కావడం గమనార్హం. లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్.. హోర్ముజ్ జలసంధిని తిరిగి మూసేసింది. మెరికా–ఇరాన్ మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో హిజ్బుల్లాను చేర్చలేదని పేర్కొంటూ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న సైనిక చర్యకు ట్రంప్ మద్దతు తెలిపారు. 'లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యను ఒప్పందం నుంచి ఎందుకు మినహాయించార'ని ప్రశ్నించగా.. 'హిజ్బుల్లా కారణంగానే లెబనాన్‌ను ఒప్పందంలో చేర్చలేదు. అది కూడా త్వరలోనే పరిష్కారమవుతుంది. ఫర్వాలేదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

# ఇరాన్ చుట్టూ అమెరికా బలగాల పహారా

- కాల్పుల విరమణ తాత్కాలికమే..
- ఒప్పందం ఉల్లంఘిస్తే మునుపెన్నడూ చూడని రీతిలో దాడి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన



**వాషింగ్టన్/బీరుట్, ఏప్రిల్ 9:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరుకున్నాయి. అమెరికా – ఇరాన్ మధ్య రెండు వారాల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, యుద్ధ మేఘాలు ఇంకా తొలగిపోలేదు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు ఆ ప్రాంతం నుండి కదిలేది లేదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక కీలక ప్రకటన చేస్తూ, ఇరాన్ పరిసరాల్లో తమ యుద్ధ నౌకలు, విమానాలు, అత్యాధునిక ఆయుధ సంపత్తి నిరంతరం పహారా కాస్తాయని తెలిపారు. "పూర్తిస్థాయి ఒప్పందం అమలయ్యే వరకు మా సైనికులు వెనక్కి రారు. మా సైన్యం ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూనే, తదుపరి మిషన్ కోసం సిద్ధంగా ఉంది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా భారీ స్థాయిలో విరుచుకుపడతామని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానానికి ఎటువంటి ఆటంకం కలగకూడదని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం అయ్యాయి. లెబనాన్‌పై జరిగిన ఈ భీకర దాడుల్లో ఇప్పటివరకు కనీసం 254 మంది మరణించగా, 1,100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ముఖ్యంగా రాజధాని బీరుట్ మరియు దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లోని నివాస సముదాయాలు, వాణిజ్య కేంద్రాలపై క్షిపణుల వర్షం కురవడంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. లెబనాన్ కూడా కాల్పుల విరమణలో భాగమేనని ఇరాన్ వాదిస్తుండగా, ఇజ్రాయెల్ మాత్రం తన దాడులను సమర్థించుకుంటోంది. ఈ పరిణామాలు తాత్కాలిక శాంతి ఒప్పందం భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయి. ప్రపంచ దేశాలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి.

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

**పుదుచ్చేరిలో అత్యధికంగా 86.92 శాతం నమోదు.. మే 4న ఫలితాలు**




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాలోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# పాకిస్థాన్‌పై నమ్మకం లేదు

**ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:** అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.



# బెంగాల్‌లో మార్పు ఖాయం..

- మళ్లీ అదే రిపీట్ అవుద్ది: మోదీ
- టీఎంసీ సర్కారుకు వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది
- హాల్దియా ప్రచారంలో దీదీ సర్కారుపై ప్రధాని నిప్పులు



**హాల్దియా, ఏప్రిల్ 9:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం హాల్దియాలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన.. బెంగాల్‌లో మార్పు గాలి వీస్తోందని, త్వరలోనే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరబోతుందని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో జరిగిన అద్భుతం, ఈసారి భవానీపూర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పునరావృతం అవుతుందని ఆయన జోస్యం చెప్పారు. బెంగాల్ ప్రజలు ప్రస్తుత ప్రతికూల పరిస్థితులను ఓడించాలని నిర్ణయించుకున్నారని మోదీ పేర్కొన్నారు. "దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆర్థికంగా వేగంగా దూసుకుపోతుంటే, టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తోంది. ఇది కేవలం సాధారణ ఎన్నికలు మాత్రమే కాదు.. బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు పునాది వేసే ఎన్నికలు" అని ఆయన అభివర్ణించారు. దేశం పురోగమిస్తున్న తరుణంలో టీఎంసీ సర్కార్ రాష్ట్రాన్ని వెనక్కి నెడుతోందని ఆరోపించారు. హాల్దియా వంటి పారిశ్రామిక కేంద్రాల దుస్థితిపై ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు దేశం నలుమూలల నుంచి ప్రజలు ఉపాధి కోసం హాల్దియాకు వచ్చేవారని, కానీ నేడు ఇక్కడి యువత ఉద్యోగాల కోసం అండమాన్, ఒడిశా వంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారని విమర్శించారు. "టీఎంసీ హయాంలో కర్మాగారాలు మూతపడ్డాయి. కానీ చొరబాటుదారుల పరిశ్రమలు, నకిలీ పత్రాల తయారీ, పశువుల అక్రమ రవాణా వంటి అసాంఘిక రంగాలు మాత్రం విచ్చలవిడిగా పెరిగాయి" అని మోదీ ఎద్దేవా చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు మే 4వ తేదీన వెలువడనున్నాయి. ప్రధాని పర్యటనతో బెంగాల్ బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

చురకలు



## ఘనంగా గోమాతపూజ, అన్నపూజ



**భీంగల్ / వేల్పూర్ మార్చి 9 :**

వేల్పూర్ శ్రీ సాయిబాబా సన్నిధిలో గురువారం సకల దేవతల ఆశీర్వాదాలను అష్టైశ్వర్యాలను ప్రసాదించే గోమాతను అందంగా అలంకరించి గోమాత పూజ చేశారు. తర్వాత భోజనాలయంలో అన్నదాతలచే అన్న పూజ నిర్వహించారు. పంచలోహాలతో కూడిన గోవిందగిరి స్వామి విగ్రహాన్ని నెలకొల్పిన ధ్యాన మందిరంలో భజన కళాకారులు భజనలు చేశారు. భీంగల్ కు చెందిన జిల్లా లక్ష్మీ రమేష్ దంపతులు, వారి కొడుకు కోడలు జిల్లా నవ్యశ్రీ రాజేష్ దంపతులు, సాయిబాబా ఆలయ అర్చకుడు కాజల్ అనురాగ్ పాండే దంపతులు, మోతెకు చెందిన చేపూర్ రాజవ్వ శ్రీనివాస్ దంపతులు అన్న సత్రాన్ని నిర్వహించారు. అన్న ప్రసాదాన్ని నిర్వహించిన దంపతులకు శాలువా కప్పి వ్యవస్థాపకుల చిత్రపటాలని జ్ఞాపికగా బహుకరించారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య సాయి పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, సాయి సేవకులు అన్న సత్రంలో సంపూర్ణ సేవలను అందించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 :**

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. నిజామాబాదు మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ కె.ఉమారాణి మజ్జిగ పంపిణీని లాంచనంగా ప్రారంబించారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు మండిపోతున్న క్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు..ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగ, అంబలి పంపిణీకి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.. ఎండల దృష్ట్యా ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి, పి.రాఘవేందర్, పూర్వాధ్యక్షులు డి.యాదగిరి,పి.లక్ష్మినారాయణ,బి.గురుప్రసాద్, కరిపె రవీందర్, పుల్గం హన్మాండ్లు, రమేష్, చింతల గంగాదాస్, రీజియన్ చైర్మెన్ ఉదయ సూర్యభగవాన్,జోన్ చైర్మెన్ భూమన్న, ఉపాధ్యక్షులు రవీంద్రనాథ్ గుప్త, ప్రోగ్రామ్ చైర్మెన్ జైపాల్ కాలె తదితరులు పాల్గొన్నారు.

## సిర్నాపల్లి వేంకన్న కల్యాణంలో ఎమ్మెల్యే





**ఇందల్వాయి, ఏప్రిల్ 9:**

ఇందల్వాయి మండలం సిర్నాపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన స్వామివారి కల్యాణం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పండితులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ప్రాంగణంలో నూతన కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10 లక్షలను కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. సిర్నాపల్లి గ్రామంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామ సుమన్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, మునిపల్లి సాయి రెడ్డి, ముసుకు సాయి రెడ్డి, నాయకులు అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, వాసు బాబు, ఉమ్మాజీ నరేష్, హన్మండ్లు, రాంచందర్ గౌడ్, శ్యాం సన్, అంబర్ సింగ్, సర్పంచ్ వనిత, సాయి కృష్ణ, ఉప సర్పంచ్ సుదర్శన్, ఎల్ఐసీ గంగాధర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కుందేని భూమయ్య, కార్యదర్శి సొప్పరి జగదీష్, ఉపాధ్యక్షులు మోతే రాజు, చెన్నబోయిన నర్సయ్య, గూండ్ల రవి, కుందేని పురుషోత్తం, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి
- గన్నారం శివారులో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- నియోజకవర్గంలో 218 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని విధంగా తెలంగాణలో పాలన



**ఇందల్వాయి, ఏప్రిల్ 9 :**

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, సాగులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి అన్నారు. గురువారం ఇందల్వాయి పీఏసీఎస్ ఆధ్వర్యంలో గన్నారం శివారులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తూకం యంత్రాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కొనుగోలు ప్రక్రియను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**విమర్శలకు తిప్పికొట్టిన ఎమ్మెల్యే**

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇది ఓర్వలేకే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు.

**భారీ స్థాయిలో కొనుగోళ్లు**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 218 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, తద్వారా రైతులకు రవాణా ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని తెలిపారు.

**కోతలు లేని కొనుగోలు**

ధాన్యం సేకరణలో ఎలాంటి కోతలు లేకుండా, పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ సాగాలని అధికారులను ఆదేశించారు. "మన ప్రాంతంలో వరి అత్యధికంగా సాగు అవుతోంది. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుంది, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, స్థానిక సర్పంచ్ సుజాత-శ్రీనివాస్, ఏవో శ్రీకాంత్, సీఈవో శ్రీకాంత్ , ఎఈఓ ప్రకాష్ గౌడ్, ఇందల్వాయి సర్పంచ్ లోకాని గంగమణి, గంగారాం , ఇందల్వాయి తాండ సర్పంచ్ సుదర్శన్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నాయకులు భాస్కర్ రెడ్డి, మునిపల్లి సాయి రెడ్డి, సాయి రెడ్డి, అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, వాసుబాబు, ఉమ్మాజి నరే ష్, హన్మండ్లు, రాంచందర్ గౌడ్, శ్యాంసన్, అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యానికి బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



**జుక్కల్, ఏప్రిల్ 9**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని ఎనబోరా, మాదన్ ఇప్పర్గా, దోతి, గ్రామాల్లో ఐకెపి గ్రామ సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం మద్దతు ధర కొనుగోలు కేంద్రాలను గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు గజానన్ దేశాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వరిధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు ఆదేశాల మేరకు డోంగ్లి వరి ధాన్యానికి క్వింటాలుకు మద్దతు ధర గ్రేడ్ ఏ రకం రూ.2389 సాధారణ రకం రూ.2369 ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని అన్నారు. అదేవిధంగా మదన్ హిప్పర్గా గ్రామంలో సర్పంచ్ బాచావార్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో, ధోతి గ్రామంలో సర్పంచ్ సంగం పటేల్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని వెల్లడించారు. రైతు శ్రేయస్సు కోసమే వరి ధాన్యం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యూనుస్ పటేల్, ఐకెపి ఎపిఎం జగదీష్ కుమార్, డోంగ్లి మండలంలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఐకెపి సిబ్బంది వరి ధాన్యం రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ ఫీల్డ్ విజిట్‌తో విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన



**నిజామాబాద్ రూరల్, సిరికొండ, ఏప్రిల్ 9:**

సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా వ్యవసాయ ఫీల్డ్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ధర్పల్లి ప్రాంతానికి చెందిన రైతు బాబురావు పంట పొలాన్ని సందర్శించి కూరగాయల సాగు విధానం, పంటల సంరక్షణ, నీటి వినియోగం వంటి అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అలాగే వరి పంటలో కోతకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పురుగులు–వ్యాధుల నియంత్రణ, సరైన సమయంలో కోత నిర్వహణ వంటి విషయాలను రైతులు వివరించారు. ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా విద్యార్థులు వ్యవసాయ పనితీరుపై ప్రాయోగిక అవగాహన పొందినట్లు ప్రిన్సిపల్ గడ్డం రాజేష్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలపై కూడా స్పష్టత పెరిగిందని పేర్కొన్నారు.

## ఘనంగా ఎన్ ఎస్ యు ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**భీమ్‌గల్ , ఏప్రిల్ 9 :**

ఎన్ ఎస్ యు ఐ (నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా) 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమ్‌గల్ పట్టణంలోని గురువారం బస్టాండ్ వద్ద ఎన్ఎస్‌యుఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్ ఆధ్వర్యంలో ఎన్.ఎస్.యు.ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భీమ్‌గల్ మున్సిపల్ చైర్ పర్సన్ బొదిరే. నాగమణి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొదిరె.స్వామి,జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆరెపల్లి నాగేంద్రబాబు ముఖ్య అతిథులు హాజరయ్యారు. ముందుగా భీమ్‌గల్ మున్సిపల్ చైర్ పర్సన్ బొదిరే.నాగమణి,మండల అధ్యక్షుడు స్వామి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగేంద్ర ఎన్ ఎస్ యు ఐ యువకులతో కలిసి జెండా ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొదిరె.స్వామి మీడియాతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛ, న్యాయమైన విలువల ఆధారంగా బాధ్యత యుతమైన పౌరులు, నాయకులను రూపొందిం చేందుకు విద్యార్థి సమాజానికి సాధికారత కల్పించాలనే లక్ష్యంతో, కేరళ విద్యార్థి సంఘం, పశ్చిమ బెంగాల్ ఛత్ర పరిషత్‌లను విలీనం చేస్తూ 1971లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎన్.ఎస్.యు.ఐ ని ఏర్పాటు చేశారని, నేడు ఎన్ ఎస్ యు ఐ దేశంలోని అతిపెద్ద విద్యార్థి సంఘం గా ఉంది అని ఆయన అన్నారు.ఎన్ ఎస్ యు ఐ ప్రతి ఒక్క విద్యార్థికి విద్యార్థి దశ నుండే ప్రశ్నించే తత్వం సమస్యలపై పోరాడే తత్వం నాయకత్వ లక్షణాలను పెంపొందించి వారిని గొప్ప పౌరులుగా తీర్చి దిద్దుతుందని. ఎన్.ఎస్.యు.ఐ లో సంఘంలో పని చేసి ఎందరో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో గొప్ప గొప్ప పదవులు అధిరోహించారని బొదిరే. స్వామి అన్నారు. బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఉమ్మడి రాష్ట్ర ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడిగా పనిచేశారని అక్కడి నుండి అంచలం చెలుగాగా ఎదిగి ఇప్పుడు టీపీసీసీ అధ్యక్షులుగా ఎమ్మెల్సీ కొనసాగుతున్నారని, మాజీ ఎన్ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ విద్యార్థి నిరుద్యోగులు పక్షాన గలమెత్తి బి.ఆర్.ఎస్ ప్రభుత్వం పై నిరంతర పోరాటం చేసినందుకుగాను అధిష్టానం ఆయన కష్టాన్ని గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిందని, అలాగే మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల్లో సైతం అనేకమంది ఎన్ ఎస్ యు ఐ లో పనిచేసిన వారు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని ఈ సందర్భంగా బొదిరే.స్వామి గుర్తు చేశారు.

ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుండే ఎన్ ఎస్ యు ఐ లో పనిచేయాలని తద్వారా సామాజిక రాజకీయ స్పృహ విద్యార్థులలో, యువకులలో పెం పొందుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్ది.అవినాష్, ఎస్సీ సెల్ అధ్య క్షుడు పర్స అనంతరావు, వార్డ్ కౌన్సిలర్ బాదావత్ సం గ్యనాయక్,12వ వార్డు ఇంచార్జ్ సుంకరి సురేష్, ముచ్కూర్ శాఖ అధ్యక్షులు గట్టు మురారి, మహేష్, ముండి దినేష్, ఎన్ ఎస్ యు ఐ యువకులు అదనాన్,అక్షయ్, శివ, యశ్వంత్, ముత్యం, రంజిత్, ప్రశాంత్, మనీ,రామ్ చరణ్, సాగర్, చర ణ్,భార్గవ్, రిషి అంజి, షాజీ, బబ్లు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా జాదూ యుగంధర్ రంగనాథ్ జన్మదినోత్సవం



**భీంగల్, ఏప్రిల్ 9 :**

ప్రముఖ వెంట్రిలాక్విస్ట్ అలాగే మిమిక్రీ కళాకారుదు జాదూ యుగంధర్ రంగనాథ్ జన్మదినోత్సవాన్ని భీంగల్ పట్టణంలోని శ్రీరాంనగర్ రెండవ వీధిలో గల కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ కవి కంకణాల రాజేశ్వర్, ప్రముఖ సైకాలజిస్ట్ తిరునగరి శ్రీహరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ శుభ సందర్భంగా కంకణాల రాజేశ్వర్, తిరునగరి శ్రీహరి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వేదాంతం రంగనాథ్ @ జాదూ యుగంధర్ రంగనాథ్ ఐదు దశాబ్దాలుగా దివంగత పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ స్ఫూర్తితో వెంట్రి లాక్విజం (బొమ్మలతో మాట్లాడించడం), మిమిక్రీ కళాకారునిగా అజరామరమైన సేవలు అందిస్తున్నారు. గొంతుతో మాయ చేస్తారు. తమ స్వరంతో పలు రకాల ధ్వనులను అనుకరిస్తూ ఆశ్చర్యపరుస్తారు. ప్రకృతి సవ్వడులు, పక్షులు, జంతువుల అరుపులు, ప్రముఖులను అనుకరిస్తూ వాహ్వా అనిపిస్తున్నారు. తమ కళతో రంజింపజేస్తారు. ధ్వని అనుకరణలో సత్తా చాటుతున్నారు. ఇలా అనేక అత్యద్భుత ప్రదర్శనలు ఇచ్చి నేటికీ ఇస్తూ కళా హృదయుల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తున్నారు. రంగనాథ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కంకణాల, తిరునగరి కాంక్షించారు. కార్యక్రమంలో దేవి రమేష్, కండక్టర్ నరసయ్య, కేశపురం సుమన్, పిట్టల సందీప్ పాల్గొన్నారు.

# సమష్టి కృషితో 'అరైవ్ – అలైవ్'ను విజయవంతం చేయాలి

- అధికారులతో సమీక్షలో కలెక్టర్, సీ.పీ




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 :**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు కొనసాగనున్న అరైవ్ – అలైవ్ కార్యక్రమాలను జిల్లాలో విస్తృత స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సూచించారు. ఈ కార్యక్రమం అమలు తీరు గురించి రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , డీజీపీ శివధర్ రెడ్డిలు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పీలు, సీ.పీలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. దేశ వ్యాప్తంగానే కాకుండా రాష్ట్రంలోనూ నానాటికీ రోడ్డు ప్రమాదాలు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో వీటి నియంత్రణ కోసం ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు వీలుగా, ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేలా చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు. ఈ సందర్భంగా వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీ.పీ సాయి చైతన్య ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన అరైవ్ – అలైవ్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. వార్డు సభ్యులు, సర్పంచ్ లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సహా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని అన్నారు. 13వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచ్ ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. అదేవిధంగా రిటైర్డ్ టీచర్లు, డాక్టర్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులతో కూడిన రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఈ కమిటీలో కనీసం ముగ్గురు మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని అన్నారు. ఎక్కడైనా రోడ్ల పక్కన పాడుబడిన బావులు ఉంటే పూడ్చివేయించాలని, ముళ్ళ పొదలు, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. 15వ తేదీన చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డేగా జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. స్కూల్ బస్సులు ఫిట్ నెస్ కలిగి ఉండేలా చూడాలన్నారు. 16 తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారు ప్రజలకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలన్నారు. అలాగే, వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కాగా, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాలలో తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స ఎలా చేయాలి, క్షతగాత్రులను సత్వరమే సమీప ఆసుపత్రికి తరలించడం, రహ్ వీర్ కింద ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకం గురించి 17వ తేదీన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. ప్రమాదాల నివారణకు కృషి చేసిన వారిని గుర్తించి సన్మానించాలని సూచించారు. 18వ తేదీన ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించే వారిని గుర్తిస్తూ, వారికి కౌన్సిలింగ్ చేయాలని సూచించారు. ఈ నెల 16న మండల స్థాయిలో నిర్వహించే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సభల్లోనూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రధాన కూడళ్ళలో మానవహారాలు జరపాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గంజాయికీ అలవాటు పడిన ఇద్దరిపై కేసు నమోదు



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9;**

భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవకు అలవాటు పడిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. భీమారం ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం, పొల్లవేని రాజేందర్ మరియు ఆలం మధుకర్ అనే వ్యక్తులు కొంతకాలంగా తమ స్నేహితులతో కలిసి గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందింది.ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకుని, గంజాయి వినియోగం నిర్ధారణ కోసం ప్రత్యేక పరీక్షా పరికరంతో వైద్య అధికారుల సమక్షంలో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ ఫలితం వచ్చినట్లు తెలిపారు. దీంతో వారిపై ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 27(బి) ప్రకారం కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువకులు తమ ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వ్యసన విముక్తి కేంద్రాలకు తరలిస్తామని హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉం చేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే గంజాయి సేవిస్తున్న వారి గురించి సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యం




**మెదక్, ఏప్రిల్ 9 :**

మెదక్ జిల్లా, ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల నాలుగో రోజును పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలో 'రెడ్ రన్' వాకథాన్ నిర్వహించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుండి రాందాస్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 385 మంది ఎయిడ్స్ బాధితులు ఉన్నారని, వారికి జిల్లా ఆసుపత్రిలోని ఏఆర్టీ కేంద్రం ద్వారా మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అసురక్షిత సంబంధాలు, కలుషిత రక్తం, వాడిన సిరంజీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధితులు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. పల్లెలు, పట్టణాల్లో కళాజాతల ద్వారా ఎయిడ్స్ నివారణపై ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత, డి.సి.హెచ్.ఎస్ శివ దయాల్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్లకార్డులతో పాల్గొని నినాదాలు చేశారు.

## కొనసాగుతున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల పోరాటం




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 :**

మందమర్రి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను తొలగించి కొత్త టెండర్ విధానాన్ని అమలు చేస్తున్నందుకు నిరసనగా ఎస్సీకేఎస్ సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పాలచెట్టు ఏరియాలో సెక్యూరిటీ గార్డులు భిక్షాటన చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సీ కేఎస్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ, సుమారు 220 మంది కార్మికులను ఒక్కసారిగా ఉద్యోగాల నుంచి తొలగించడం వల్ల అంతే సంఖ్యలో కుటుంబాలు రోడ్డుపాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం కార్మికుల సమస్య మాత్రమే కాకుండా మందమర్రి పట్టణ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. పాలకులు కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన సమయంలో, ఇప్పటికే పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగాలు పోతున్నా స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఈ 220 మంది కార్మికుల ఉపాధి కోల్పోవడం వల్ల పట్టణంలోని చిన్న వ్యాపారులు, ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని తెలిపారు. ఓట్లతో గెలిపించిన ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ పాలకులు మౌనంగా ఉండడం వారి వైఖరిని ప్రతిబింబిస్తోందని అన్నారు. గత 12 సంవత్సరాలుగా అంకిత భావంతో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులను ఒక్కసారిగా తొలగించడం సింగరేణి యాజమాన్యం తీసుకున్న తగని నిర్ణయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సింగరేణి యాజమాన్యం స్పందించి కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలిచి మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ

**మెదక్, ఏప్రిల్ 9 :**




మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు గురువారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిపై ఆరా తీశారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పెండింగ్ లేకుండా చూడాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరుపై ఎస్‌హెచ్ఓ మహేష్‌ను వివరాలు అడిగి తెలుసుకుని అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి రోజూ సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎసైలు మల్లికార్జున్, విఠల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి తాపాన్ని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**చేగుంట, ఏప్రిల్ 9 :**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేగుంట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా మంచినీటిని సేవించి చలివేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు, బాటసారులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో చేగుంట తహసీల్దార్ శివ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి



**ఇందల్వాయి, ఏప్రిల్ 9 :**

ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో ఇటీవల మరణించిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి గురువారం పరామర్శించారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే మృతుల చిత్రపటాలకు పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పుదారి రాజలింగం, పత్తిపాకాల సాయవ్వ, తీగల గంగారాం, పత్తిపాకల చిన్న రాజన్న, పనాస అనిల్, దేవయ్యగారి గంగవ్వ, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నీరేటి గంగాధర్, ఈరమల్లా రవి కుమార్తె కుటుంబాలను పరామర్శించారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో అర్హులైన మృతుల కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ ఇందల్వాయి మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామ సుమన్, సీనియర్ నాయకుడు లారీ గంగారెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## సిరికొండకు ప్యాడి కొనుగోలు కేంద్రాలు

**నిజామాబాద్ రూరల్ సిరికొండ,ఏప్రిల్ 9, :**

నిజామాబాద్ రూరల్ సిరికొండ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ప్యాడి కొనుగోలు కేంద్రాల మంజూరుపై నెలకొన్న అనిశ్చితికి తెరపడింది. సెంటర్లు వస్తాయా లేదా అన్న అయోమయంలో ఉన్న రైతులు, సొసైటీ సిబ్బందికి రూరల్ ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి చొరవతో ఊరటనిచ్చారు.సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి సిరికొండకు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయించేలా కృషి చేసి సెంటర్లను తీసుకువచ్చారు. దీంతో రైతులు, సొసైటీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ దడివే గణేష్, ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బడాల మైపాల్, ప్యాట్ల లింబాద్రి, సాయిరెడ్డి రూరల్ ఎమ్మెల్యే కు సిరికొండ మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## రామారావుపేటలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం






**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 :**

ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జైపూర్ సీఐ నవీన్, ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో రామారావుపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జైపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, వారితో మాట్లాడి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఆస్తి సంబంధిత నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా అపరిచితులపై అప్రమత్తంగా ఉండడం,ట్రాఫిక్ నియమాలు పాటించడం, ఆన్‌లైన్ లావాదేవీలలో జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా, సరైన పత్రాలు లేని 66 ద్వి చక్ర వాహనాలు మరియు 3 ఆటోలను స్వాధీనం చేసుకు న్నారు. వాహన దారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన పత్రాలు కలిగి ఉండాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత కో సం ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, పోలీసులతో సహక రించి సమాజంలో శాంతి భద్రతలను కాపాడాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బహుజన మహనీయులను స్మరించుకుందాం



**సిద్దిపేటటౌన్, ఏప్రిల్ 9:**

బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు)తో పాటు బీఎల్‌టీయూ, బీడీఎస్ఎఫ్ వంటి ప్రజా సంఘాలు కలిసి “బహుజన మహనీయులను స్మరించుకుందాం” అనే కరపత్రాన్ని సిద్దిపేట జిల్లా కేంద్రంలో విడుదల చేశాయి. ఈ కరపత్రాన్ని పాపయ్య, కిస్తయ్య, సత్తయ్య, నర్సింలు, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, దేవులపల్లి కిష్టయ్య, జక్కుల శ్రీనివాసు, సందలపురం కనకయ్య, రాములు, రంగాచారి, పాల సాయిరాం, సిరాజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు సత్తయ్య, దెబ్బట ఆనంద్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక విప్లవకారుల జయంతులు, వర్ధంతులను ఏప్రిల్ నెలంతా గ్రామ గ్రామాన నిర్వహించాలని పిలుపునిచ్చారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో అణచివేతను ఎదుర్కొంటున్న వర్గాల ఐక్యత అవసరమని పేర్కొన్నారు. బహుజన మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు. శివరాత్రి శ్రీనివాస్, రాజు, మహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలి

- సీఎస్ రామకృష్ణారావు ఆదేశం
- వచ్చే సోమవారం నుంచి 'అరైవ్ అలైవ్' వారోత్సవాలు
- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్, ఏప్రిల్ 9 :**

మెదక్ జిల్లా, రోడ్డు ప్రమాదాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా వచ్చే సోమవారం (ఏప్రిల్ 13) నుండి రాష్ట్రవ్యాప్తంగా 'అరైవ్ అలైవ్' వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ నుండి డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్న కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో 13వ తేదీ నుండి నిర్వహించే ఈ వారోత్సవాల్లో భాగంగా గ్రామ సభలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను (ప్రమాద ప్రాంతాలు) గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులతో ర్యాలీలు, వాహన చోదకులకు కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలీసులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధునిక సాగుతోనే రైతులకు ఆర్థిక పురోగతి



**మెదక్, ఏప్రిల్ 9:**

మెదక్ జిల్లా, రైతులు సంప్రదాయ సాగు పద్ధతులను వీడి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, అప్పుడే ఆర్థికంగా బలోపేతం అవుతారని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం మెదక్ కలెక్టరేట్‌లో వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేవలం వరి వంటి పంటలపైనే ఆధారపడకుండా లాభదాయకమైన పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, పండ్ల తోటల వైపు రైతులు మొగ్గు చూపేలా పంట మార్పిడి (క్రాప్ రొటేషన్ ) పై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉద్యానవన శాఖ ద్వారా జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పశుసంవర్ధక శాఖ ద్వారా పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయడంతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. మత్స్యశాఖపై సమీక్షిస్తూ.. జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు శాస్త్రీయ చేపల పెంపకంపై శిక్షణ ఇవ్వాలని, సంఘాలు లేని గ్రామాల్లో కొత్త రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని, అలాగే మత్స్యకార మహిళలకు ఉపాధి మెరుగుపరిచేలా చేపల వంటకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, పశుసంవర్ధక అధికారి వెంకటయ్య, మత్స్యశాఖ అధికారి మల్లేశం, ఉద్యానవన అధికారి ప్రతాప్ సింగ్, ఎల్.డి.ఎం బాపూజీ పాల్గొన్న ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి రైతుకు చేరవేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## 22 సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్





**ఆర్మూర్ ఏప్రిల్ 9:**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జర్నలిస్ట్ కాలనీలోని భక్త ఆంజనేయ మందిరం యందు గురువారం రోజు 22 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్., ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమన్నారు. ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు. నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్, కౌన్సిలర్ దియా అగర్వాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ అగర్వాల్, జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్, సీసీ కెమెరాల ఇన్స్టాలేషన్ ప్రవీణ్ చారి, ప్రజలు పాల్గొన్నారు.

# మన ఊరు–మన భద్రత–మన బాధ్యత

- పోలీస్ కమిషనర్ సాయి చైతన్య
- 'అరైవ్ అలైవ్–2026'లో సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం





**ఆర్మూర్, ఏప్రిల్ 9:**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్ డివిజన్‌లో కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లకు "మన ఊరు–మన భద్రత–మన బాధ్యత" అనే అవగాహన కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కామాక్షి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు 'అరైవ్ అలైవ్–2026' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. వ్యవసాయదారులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టేటప్పుడు భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నివారించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాల మధ్య తగిన దూరం పాటించాలన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నివారించాలని సూచించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. అధిక వేగం, అలసటతో డ్రైవింగ్, క్రమశిక్షణ లోపం ప్రమాదాలకు కారణమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగి రోడ్డు ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ఇటీవల ఆర్మూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల తల్లిదండ్రులు మాట్లాడి తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం 'అరైవ్ అలైవ్' ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ జి. బస్వా రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లహరి రఘు, వైస్ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్లు, టౌన్ సీఐ పి. సత్యనారాయణ గౌడ్, రూరల్ సీఐ జి. జాన్ రెడ్డి, ఐ–రాడ్ మేనేజర్ వర్ష, ఎస్ఐలు రజనీకాంత్, సంజీవ్, అనిల్, రాము, శ్యామ్‌రాజ్, శైలేందర్, కిరణ్ పాల్, రాజేశ్వర్, ఎన్ఎస్సీ కౌన్సిల్ సభ్యులు సుందర్, క్రాంతి గంగారెడ్డి, వై. సాయ రెడ్డి, సాగర్ రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికుల నిరవధిక సమ్మె



**చేగుంట, ఏప్రిల్ 9:**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏఈజేఈ) ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక సంఘం పిలుపుమేరకు విద్యుత్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు గురువారం కూడా కొనసాగింది. తూప్రాన్ డివిజనల్ కార్యాలయం ముందు అన్ మ్యాన్, ఆర్టిజన్, పీస్ రేట్ వర్కర్లు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్ ఉద్యోగులను కన్వర్షన్ చేయాలని, అన్ మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. పీస్ రేట్ కార్మికులకు జీవో నంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, 2026 పీఆర్సీని తక్షణమే వర్తింపజేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె ఆపేది లేదని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డివిజన్ చైర్మన్ రాజి రెడ్డి, కన్వీనర్ హరికాంత్ గౌడ్, డివిజన్ నాయకులు రవీంద్ర ప్రసాద్, వెంకటేష్, రాజుకుమార్, మల్లేశం, యాదగిరి, నరేష్ పాల్గొన్నారు.

## రైస్ డిపోలపై సివిల్ సప్లై దాడులు



**బాన్సువాడ, ఏప్రిల్ 9 :**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని పలు రైస్ డిపోలపై సివిల్ సప్లై అధికారులు అకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 73 కిలోల పీడీఎస్ బియ్యం, నూకలను స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై డిప్యూటీ అధికారి షరీఫ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు సంబంధిత రైస్ డిపోను సీజ్ చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసే డిపో యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని షరీఫ్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

# తపస్వితేజో నిలయంలో అన్నదానం



**ఆర్మూర్ ఏప్రిల్ 9:**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని తపస్వితేజో నిలయంలో చిన్నారులకు గురువారం అడ్వకేట్ నేరెళ్ల విజయ్ కుమార్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ కుటుంబంలో జరిగే శుభకార్యక్రమాలను అనథాశ్రమంలో నిర్వహించడంతో మానవతా విలువలు పెరుగుతాయని, మంచి తృప్తి, సంతోషం కలిగిస్తాయని తెలిపారు. తపస్వితేజో నిలయం ఆశ్రమమునకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. యువత సేవ భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నేరెళ్ల పద్మ, నడిపి నరసయ్య, స్నేహ, భూమేష్, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**ఆర్మూర్, ఏప్రిల్ 9 :**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 37కల్యాణ లక్ష్మి , 3 షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ గుత్ప–ఆలూరు, కల్లెడ–ఆలూరు మార్గాల్లో డబుల్ లైన్ రోడ్లను మంజూరు చేయించామని తెలిపారు. ఆలూరు గ్రామానికి బైపాస్ రోడ్డుకు గ్రామస్తుల ఏకాభిప్రాయంతో చర్యలు తీసుకుంటామని, అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. ఆలూరు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సూర శ్రీకాంత్, కల్లెడ సర్పంచ్ సుస్మిత, మచ్చర్ల సర్పంచ్ కట్ట నర్సయ్య, హరీష్, మల్లయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బోథ్ అటవీ కార్యాలయంలో ఏసీబీ దాడులు

### లంచం కేసులో ఇద్దరు అధికారులు అరెస్ట్



**బోథ్:** బోథ్ కేంద్రంలోని అటవీ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జూనియర్ అసిస్టెంట్ పరశురాం లంచం స్వీకరిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల ప్రకారం, ఎన్‌ఆర్‌ఇజీఎస్ పనుల నిమిత్తం మొక్కలకు నీళ్లు పోసిన వ్యక్తి నుండి నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్‌ఓ) ప్రణయ్ కుమార్ ఆదేశాల మేరకు డబ్బులు తీసుకున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ కేసులో ఎఫ్‌ఆర్‌ఓ ప్రణయ్ కుమార్ (A1), జూనియర్ అసిస్టెంట్ పరశురాం (A2)గా నమోదు చేసి ఇద్దరినీ అరెస్ట్ చేశారు. సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకుని మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని అధికారులు తెలిపారు. అరెస్ట్ చేసిన ఇద్దరు అధికారులను కరీంనగర్‌లోని అవినీతి నిరోధక శాఖ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ మధు వెల్లడించారు.

## సర్పంచ్ వినతి పత్రానికి స్పందించిన సింగరేణి అధికారులు



**మంథని, ఏప్రిల్ 09 :** దుబ్బపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి కృష్ణవేణి నరేష్ రావు, చిల్లపల్లి గ్రామ సర్పంచ్ గోపు సంతోష్ ల వినతి పత్రానికి సింగరేణి అనే అధికారులు స్పందించారు. గురువారం మంథని మండలం దుబ్బపల్లి, చిల్లపల్లి గ్రామాలను సింగరేణి అధికారులు సందర్శించారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గ్రామాలలో ఉపాధి పథకం ఏర్పాటు చేస్తామని సింగరేణి అధికారులు తెలియజేశారు. జీఎం లలిత కుమార్ ఆదేశాల మేరకు ఫారెస్ట్రీ డిజిఎం బానోతు కర్ణ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులు గ్రామంలో సందర్శించి ప్రజలకు ఉపాధి కల్పించే కార్యక్రమాల పట్ల ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. వినతి పత్రం స్పందించి గ్రామానికి వచ్చిన సింగరేణి అధికారులను సర్పంచులు, గ్రామస్తులు ఘనంగా శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సింగరేణి అధికారులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు పర్యావరణ రక్షించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగం అవ్వాలని తెలిపారు. గ్రామస్తుల ఉపాధి చర్యలకు సింగరేణి అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుడుదుల రవి, నరేష్ రావు, గ్రామస్తులు, సింగరేణి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మ్‌డ్ పోలీస్ అధికారులు, సిబ్బంది నివాస భవనాల నిర్మాణ పనులను పరిశీలించిన సీపీ



**గోదావరిఖని, ఏప్రిల్ 09:** రామగుండం పోలీస్ కమిషనరేట్ సాయుధ బలగాల అధికారుల, సిబ్బంది క్వార్టర్స్ నూతన భవనాల నిర్మాణ పనులు పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, సీపీ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేసి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు ,ఆర్ ఐ లు శేఖర్, రమేష్ ఉన్నారు.

## పదివేల లంచం తీసుకుంటూ ఏసిబి కి చిక్కిన అంతర్గాం ఆర్ఐ శ్రీమాన్..

### ఆర్ ఐ శ్రీమాన్ ను అదుపులోకి తీసుకున్న ఏసిబి అధికారులు..



**పెద్దపల్లి, ఏప్రిల్ 09:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీమాన్ పదివేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. రాయదండి గ్రామానికి చెందిన రైతు వెంకటస్వామి భూమి ఎంక్వైరీ కి సంబంధించి 10,000 లంచం డిమాండ్ చేయడంతో సదరు రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. తహసీల్దారు కార్యాలయంలో ఉన్న ఆర్ఐ శ్రీమాన్ కు రైతు వెంకటస్వామి లంచం డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వెంటనే కేసు నమోదు చేసుకుని, ఐదు గంటల పాటు విచారణ చేశారు. అనంతరం ఆర్ ఐ శ్రీమాన్ ను అదుపులోకి తీసుకొని కరీంనగర్ ప్రత్యేక కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

# ముద్దసాని ఆశయాలను కొనసాగిస్తాం..

- రైతులు, పేద ప్రజల కోసం నిరంతరం పరితపించిన నాయకుడు
- వచ్చే 15వ వర్ధంతి నాటికి జమ్మికుంటలో విగ్రహం
- దామోదర్ రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు



**కరీంనగర్, ఏప్రిల్ 09:** రైతుల కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి నిరంతరం కృషి చేశారని, ఆయన ఆశయాలను సదా కొనసాగిస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న 15వ వర్ధంతి కార్యక్రమం రోజున జమ్మికుంటలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి పదివేల మందితో సభ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. మాజీ మంత్రి, దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకొని మానకొండూరు మండలం సదాశివ పల్లి జంక్షన్ లో నెలకొల్పిన ఆయన కాంస్య విగ్రహాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి ఆవిష్కరించారు. సర్దార్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అలుగునూరులోని శ్రీ లక్ష్మీ నరసింహ కన్వెన్షన్ లో నిర్వహించిన ముద్దసాని దామోదర్ రెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ పేద ప్రజలు, కార్యకర్తల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దామోదర్ రెడ్డి విగ్రహాన్ని ఎప్పుడో ఏర్పాటు చేయాల్సి ఉండేదని, అనివార్య కారణాలవల్ల కార్యరూపం దాల్చలేదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నాయకత్వం వహించిన దామోదర్ రెడ్డి ఎంతోమంది నాయకులను తీర్చిదిద్దారని అన్నారు. తనతో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే రామ్ రెడ్డి లను ఎమ్మెల్యేలను చేసిన ఘనత దామోదర్ రెడ్డి కే దక్కుతుందన్నారు. దామోదర్ రెడ్డి వల్లనే తాను ఈ స్థాయికి వచ్చానని విజయ రమణారావు సగర్వంగా చెప్పారు. ప్రజలతో, పార్టీ నాయకులు కార్యకర్తలతో ఎలా ఉండాలో, వారికి దగ్గరగా ఉండి ఎలా పనులు చేయాలో దామోదర్ రెడ్డిని చూసి నేర్చుకున్నానని తెలిపారు. మా సోదరుడు చనిపోతే తమకు దగ్గరుండి పని చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ప్రతిపక్ష హోదాలో ఉన్నటువంటి ఏకైక ఎమ్మెల్యే ముద్దసాని దామోదర్ రెడ్డి అని, 1994లో జరిగిన ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. నిరంతరం ఆయన బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, రైతుల కోసం కృషి చేశారని అన్నారు. కమలాపూర్ నియోజకవర్గంలో ఒక్క మడి కూడా ఎండకుండా కాలువ ద్వారా నిరంతరం నీళ్లు పారించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆనాడు గ్రామాల్లో నక్సలైట్ల ఉద్యమం కొనసాగుతున్న సందర్భంలో చాలామంది యువకులు గ్రామాల్లో ఉండలేని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఎన్కౌంటర్ల పాలు కాకుండా, పోలీసు దెబ్బలు తినకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తు చేశారు. తనను నమ్ముకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు న్యాయం చేశారని అన్నారు. ఆయన ఒక్క పిలుపు ఇస్తే పదివేల మంది కార్యకర్తలు ఒక చోటికి చేరేవారన్నారు. కమలాపూర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా తయారు చేశారని,ఇప్పటికీ ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవలేదని అన్నారు. రెండు దశాబ్దాల పాటు వరుస విజయాలతో దూసుకుపోయిన దామోదర్ రెడ్డి,2004 ఎన్నికల్లో అనారోగ్య కారణాల వల్లనే ఆయన ఓటమి చెందారని తెలిపారు. దామోదర్ రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన గురించి తలవని ఊరు, మనిషి లేదని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కలిసికట్టుగా పని చేయాలని విజయ రమణారావు పిలుపునిచ్చారు.

**పేద ప్రజల పక్షపాతి దామోదర్ రెడ్డి: మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**

రెండు దశాబ్దాల పాటు సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా మంత్రిగా పని చేసిన ముద్దసాని దామోదర్ రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ అన్నారు. ముద్దసానిది మా పక్క ఊరే కావడంతో ఆయన వద్దకు ఏ పనికి వెళ్లినా కూడా కాదనకుండా చేశారని గుర్తు చేశారు. ఆయన ఫోను తీశాడు అంటే ఆ పని కచ్చితంగా కావాల్సిందేనని అన్నారు. ఆయనను నమ్ముకున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఎంతో సేవ చేశాడని గుర్తు చేశారు. దేవాలయాల్లోకి దళితులను రానివ్వ లేని రోజుల్లో ఇల్లందకుంట దేవస్థానానికి దళితుడిని చైర్మన్ చేసిన ఘనత దామోదర్ రెడ్డి కే దక్కుతుందని అన్నారు. తన కుటుంబ సభ్యులు వ్యతిరేకించినా కూడా ఒక దళితురాలిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారని అన్నారు. దామోదర్ రెడ్డి విగ్రహాన్ని దామోదర్ రెడ్డి నాయకత్వం ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలిచిందని, ఆయన నాయకత్వంలో పలువురు ఎమ్మెల్యేలుగా, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారని అన్నారు. దామన్న అడుగుజాడల్లో నడుస్తున్న ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పాటుపడతామని సత్యనారాయణ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాను శాసించిన ఏకైక నాయకుడు దామోదర్ రెడ్డి అని, ఆ నాయకుని వర్ధంతిని మనం జరుపుకోవడం సంతోషకరమన్నారు. ముద్దసానికి కృతజ్ఞతగా సదాశివపల్లిలో విగ్రహాన్ని నెలకొల్పామని కవ్వం పల్లి వివరించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దామోదర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కూడలిని మంచి ఐలాండ్ గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాటి టీడీపీ నాయకులు దామోదర్ రెడ్డితో గడిపిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కొందరు ఉద్వగానికి లోనయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి ఎమ్మెల్యేగా మంత్రిగా ప్రజలకు చేసిన సేవలు, ఆయన అనుసరించిన విధానాలు రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువకులు రాజకీయాల్లోకి రావాలన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కె శ్రీనివాస్,పెద్దపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి వోడితెల ప్రణవ్ బాబు, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముద్దసాని పురుషోత్తం రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొత్తూరి జగన్ గౌడ్, వాసాల రమేష్, డాక్టర్ పి. రవీందర్ రావు, కర్రు నాగయ్య, మాదాడి శ్రీనివాస్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, తగ్గు దామోదర్,ఆకుల నరసయ్య, మినుపాల ప్రకాష్ రావు, అక్కపాక తిరుపతి, కొత్త తిరుపతిరెడ్డి, కందుల ఆది రెడ్డి, చందా గాంధీ, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఊకంటి మధుకర్, పడాల అజయ్, పొనగంటి మల్లయ్య, కట్టంగూరి శ్రీకాంత్ రెడ్డి, రామస్వామి, రఘు, కార్పొరేటర్ నందిని, బండారి రమేష్, గోపు మల్లారెడ్డి, రవి యాదవ్, కంది అశోక రెడ్డి, కంది లక్ష్మీనారాయణ రెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, చింతల లక్ష్మారెడ్డి, నోముల అనిల్, రవీంద్ర చారి, తాళ్లపల్లి సంపత్ గౌడ్ జావా శ్రీనివాసరెడ్డి, ముసుకు ఉపేందర్ రెడ్డి, గోపగోని బసవాగౌడ్, ముఖ్యసా రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలంపియాడ్ లో బంగారు పతకాలు




**కరీంనగర్, ఏప్రిల్ 09:** విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పట్ల అవగాహన ఉండాలని మరియు వాటిలోని విషయాల పట్ల పట్టు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో చెందినటువంటి విద్యార్థులకు అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలంపియాడ్లో బంగారు పతకాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సోషల్ స్టడీస్ పట్ల అవగాహన ఉండాలని మరియు వాటిలోని విషయాలను విశ్లేషణాత్మకంగా తెలుసుకొని వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీ పరీక్షలకు హాజరై విజయాలను నమోదు చేయాలని వారు చెప్పారు. సాంఘిక శాస్త్రం ద్వారా పోటీ పరీక్షలలో సైతం విజయాలను చాలా సులభంగా సాధిస్తారని వారు అభిప్రాయపడ్డారు. సాంఘిక శాస్త్రంలోని విషయాలు కేవలం పోటీ పరీక్షలకే కాకుండా సామాజిక అవగాహన పెంపొందించుటకు చాలా ఉపకరిస్తాయని వారు చెప్పారు. ఈ నిర్వహణలో భాగంగా ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలింపియాడ్ లో పాఠశాలకు చెందినటువంటి పలువురు విద్యార్థులు బంగారు పతకాలతో పాటు రజత పతకాలను సాధించడం చాలా గొప్ప విషయం వారు చెప్పారు. కోలా అతిథి కిషన్, వి.వేద విహార్, బి. కార్తికేయ గౌడ్, విగ్నేష్ , హెచ్.శ్రీహాన్, చైతన్య తదితరులు బంగారు పతకాలతో పాటు సర్టిఫికెట్లను గెలుచుకున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు విద్యార్థులందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్తులోను మరిన్ని విజయాలను నమోదు చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గుంజపడుగు పంప్ హౌస్ లో మత్స్యకారులు చేపలు పట్టుకోకుండా అడ్డుకొని చేపలు చనిపోవడానికి కారణమైన ఇరిగేషన్ అధికారులు

**మంథని, ఏప్రిల్ 09:** గుంజపడుగు గ్రామంలోని అన్నారం సరస్వతి పంప్ హౌస్ గ్రావిటీ కెనల్ మరమ్మతుల నిమిత్తం నీటిని వదులుతున్న ఇరిగేషన్, మెగా కంపెనీ అధికారులు నీటిని వదలడంతో నీటిమట్టం తగ్గి దాదాపు క్వింటాల్ చేపలు చనిపోయాయని ఇంకా పూర్తిగా నీరు తగ్గి మత్స్యకారులకు చేపలు పట్టే అవకాశం కల్పించకుంటే దాదాపు రెండు మూడు టన్నుల చాప చనిపోయే అవకాశం ఉందని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా నిర్మించిన గుంజపడుగు పంప్ హౌస్ లో ఉపాధి దొరుకుతుందని మరియు మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది అనే కారణంతో మా భూములను త్యాగం చేశామని గతంలో మెగా కంపెనీ వారు చేపలు పట్టిస్తుంటే జిల్లా మత్స్య అధికారితో చేపలు పట్టకుండా నోటీసులు ఇప్పించడం తోపాటు 30.12.2024 న ఇరిగేషన్ ఈఈ మహాదేవపూర్ నుండి పర్మిషన్ తెచ్చుకున్నామని అప్పటి నుండి గుంజపడుగు పంపుహౌస్ ఇరిగేషన్ అధికారులు నిబంధనలు పెడుతూన్నా భరిస్తూ చేపలు పట్టుకున్నామని పంప్ హౌస్ రిపేర్ సమయంలో చేపలు పట్టుకోడానికి మీకే అవకాశం ఇస్తామని నమ్మించి చేపలు పట్టకుండా అడ్డుకొని తీరా పంపుహౌస్ లో నీటిని తీసే సమయంలో మాకు సగం చేపలు ఇస్తేనే చేపలు పట్టే అవకాశము ఇస్తాం అనే నిబంధనలు పెడితే ఆ నిబంధనకు ఒప్పుకొని చేపలు ఇచ్చిన వాటితో సంతృప్తి చెందకుండా చాపలు పట్టనివ్వమని ఈ చాపలు మాకు సంబంధించినవి అన్ని మాట్లాడుతూ ఈ రోజు చేపలు చనిపోవడానికి కారణం ఇరిగేషన్ అధికారులు అయ్యారని దీని ద్వారా మా ఆర్థిక పరిస్థితులు దెబ్బతిన్నాయని గతంలో పర్మిషన్ తీసుకున్నప్పటికీ మాకు చేపలు పెట్టకూడదు అనే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే మమ్మల్ని అడ్డుకుంటూ చేపల మృతికి కారణమైన అన్నారం సరస్వతి పంపు హౌస్ ఇరిగేషన్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని మత్స్యకారులు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, సాధుల సదానందం ,సాధుల ఓదెలు, ఉదరి శివ, నూనె చంద్రయ్య, సాదుల తిరుపతి, కందుల శంకర్, సాదుల శ్రీకాంత్, అనవేన సదానందం, దశరథం తదితరులు ఉన్నారు.



# పదే పదే వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారా?
# ఈ జాగ్రత్తలు తీసుకోండి.!

ఈ రోజుల్లో వైరల్ ఇన్ఫెక్షన్లు ఒక సాధారణ సమస్యగా మారాయి. బలహీనత, జలుబు, జ్వరాలు లేదా తరచుగా వచ్చే అనారోగ్యాలు వాతావరణం వల్ల మాత్రమే సంభవించవు. మన అలవాట్లు, రోగనిరోధక శక్తి, పరిశుభ్రత లేకపోవడం కూడా ఎక్కువగా కారణమవుతాయి. వైద్యుల ప్రకారం, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వైరల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఇన్ఫెక్షన్‌లను నియంత్రించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం..



**ఈ జాగ్రత్తలు తీసుకోండి**

మీ చేతులను తరచుగా కడుక్కోవడం వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. సబ్బు, నీరు అందుబాటులో లేకపోతే హ్యాండ్ శానిటైజర్‌ను ఉపయోగించండి.

టూత్ బ్రష్‌లు, తువ్వాళ్లు, రేజర్లు, చేతి రుమాలు లేదా నెయిల్ కట్టర్ వంటివి బ్యాక్టీరియా, వైరస్‌లకు ప్రధాన వనరులు. వాటిని ఎప్పుడూ పంచుకోకండి. మీ పిల్లలకు కూడా అదే నేర్పండి.

దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు మీ నోటిని టిష్యూ పేపర్ లేదా మోచేయితో కప్పుకోండి. ఇది ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందే ప్రమాదాన్ని బాగా తగ్గిస్తుంది.

మీకు జలుబు, దగ్గు లేదా జ్వరం ఉంటే మాస్క్ ధరించడం వల్ల మిమ్మల్ని మాత్రమే కాకుండా ఇతరులను కూడా రక్షించవచ్చు. రద్దీగా ఉండే ప్రదేశాలలో కూడా మాస్క్‌లు ఉపయోగకరంగా ఉంటాయి.

ప్రయాణ సమయంలో ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. శుభ్రమైన నీరు తాగండి. పచ్చి లేదా సరిగ్గా ఉడికించని మాంసం, చేపలను తినకండి. అవసరమైన టీకాలు వేయించుకోండి.

సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అధిక చక్కెర, ఉప్పు, వేయించిన ఆహార పదార్థాలను నివారించండి. తగినంత పండ్లు, కూరగాయలు, ప్రోటీన్, నీరు తాగడం చాలా అవసరం.

నిద్ర లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి బలహీనపడి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రోజుకు కనీసం 7 గంటలు నిద్ర అవసరం.



## సీతాఫలం నుంచి గింజలను సింపుల్‌గా ఇలా వేరు చేయవచ్చు..

ఆరోగ్యానికి ఎన్ని పండ్లు ఉన్నా.. అత్యధిక పోషకాలు ఉన్నవి మాత్రం కొన్నే ఉన్నాయి. వాటిలో సీతాఫలం ఒకటి. వీటిలో అత్యధిక పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం తదితర ఖనిజాలు అందుతాయి. అంతేకాదు శరీరానికి వ్యాధి నిరోధక శక్తిని సైతం అందుతుంది. తద్వారా వ్యాధులను నివారిస్తుంది. అయితే అంతా బాగానే ఉంటుంది. కానీ ఈ సీతాఫలం తింటున్నప్పుడు మధ్యలో గింజలు అడ్డు వస్తాయి. దీంతో ఒకింత చిరాకు అనిపిస్తోంది. అయినా అలాగే సీతాఫలాలను కాయ మీద కాయను లాగించేస్తూ ఉంటారు.

కానీ సీతాఫలానికి సంబంధించి.. మాస్టర్ చెఫ్ నెహా దీపక్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సీతాఫలాన్ని రెండు భాగాలుగా కోసింది. ఒక చెంచాతో సీతాఫలంలోని ఒక భాగాన్ని ఫుడ్ చాపర్‌లో వేసింది. అలాగే మరో భాగాన్ని సైతం అందులో వేసింది. అనంతరం ఫుడ్ ఛాపర్ మూత పెట్టి.. కొన్ని సెకన్ల పాట్లు దీనిపై ఉంచిన తాడును పలుమార్లు లాగింది. అనంతరం ఫుడ్ ఛాపర్ మూత తీయగానే.. అందులో విత్తనాలు, గుజ్జు వేర్వేరు అయిపోయాయి. స్పూన్‌తో గింజలను వేరు చేసి.. పేస్ట్‌లాగా మారిన సీతాఫలం గుజ్జును స్పూన్‌తో తినడమే తరువాయి.

ఈ వీడియోను వీక్షించిన నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఈ సింపుల్ చిట్కాను పంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇది చాలా బాగుదంటూ వ్యాఖ్యానించారు. మరొకరు.. సీతాఫల్ నుంచి విత్తనాలను తొలగించడానికి ఇది అద్భుతమైన ట్రిక్ అని అభివర్ణించారు. దీనిని తమతో పంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకో నెటిజన్ స్పందిస్తూ.. మేడం మీకు ఒక సింపుల్ చిట్కా చెబుతానంటూ.. ఒక వైర్ మెష్ కాడ ఉన్న జాలీని తీసుకుని.. అందులో సీతాఫలం గుజ్జును వేసి.. ఒక చెంచాతో.. గట్టిగా నొక్కితే గుజ్జు కింద ఉన్న పాత్రలో పడిపోతుంది. జాలీలో గింజలు ఉండిపోతాయని వివరించారు. దయచేసి దీన్ని కూడా ప్రయత్నించడంటూ నేహకు సూచించాడు.

## చిన్న పిల్లల్లో డయాబెటిస్.. ప్రారంభ లక్షణాలు ఇవే!

డయాబెటిస్ అనేది అన్ని వయసుల వారిని ప్రభావితం చేసే వ్యాధి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రతి సంవత్సరం రోగుల సంఖ్య పెరుగుతోంది. వృద్ధులు మాత్రమే కాదు, చిన్నపిల్లలు కూడా వివిధ కారణాల వల్ల డయాబెటిస్‌ను ఎదుర్కొంటున్నారు. డయాబెటిస్ తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుంది. అందువల్ల, డయాబెటిస్ ప్రారంభ లక్షణాలను తెలుసుకోవడం ముఖ్యం. కాబట్టి, పిల్లలలో ఏ లక్షణాలను గమనించాలో ఇప్పుడు తెలుసుకుందాం..



**అధిక దాహం:**

మధుమేహం ఉన్నవారికి తరచుగా అధిక దాహం వేస్తుంది. దీని వలన నీటి వినియోగం పెరుగుతుంది. మీ బిడ్డ ఎక్కువ నీరు తాగుతుంటే మీరు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు అంటున్నారు.

**అధిక మూత్ర విసర్జన:**

పిల్లల్లో మధుమేహం మరొక ముందస్తు హెచ్చరిక సంకేతం అధిక మూత్ర విసర్జన. ఈ లక్షణం కనిపిస్తే, వెంటనే అప్రమత్తంగా ఉండాలని నిపుణులు అంటున్నారు. ఈ స్థితిలో, గ్లూకోజ్ మూత్రం ద్వారా విసర్జించబడుతుంది. ఇది క్రమంగా పిల్లలలో తీవ్రమైన నిర్జలీకరణానికి దారితీస్తుంది. ఇది చివరికి మూత్రపిండాల పనితీరును ప్రభావితం చేస్తుందని నిపుణులు అంటున్నారు.

**అధిక ఆకలి:**

ఇది పిల్లలలో కనిపించే మరొక లక్షణం. వారి శరీరంలో గ్లూకోజ్ లేకపోవడం వల్ల ఆకలిగా అనిపించవచ్చు. వైద్యుల ప్రకారం, అధిక ఆకలి మంచిది కాదు. అందువల్ల, ఈ లక్షణం కనిపించినట్లయితే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

**అస్పష్టమైన దృష్టి:**

పిల్లలలో అస్పష్టమైన దృష్టి మధుమేహం లక్షణం. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు ఇది సంభవిస్తుంది. దీని వలన కంటి లెన్స్ ఉబ్బిపోయి సరిగ్గా దృష్టి కేంద్రీకరించడం కష్టమవుతుంది.

**బరువు తగ్గడం:**

పిల్లల్లో డయాబెటిస్‌కు ఇది కూడా ఒక ప్రధాన లక్షణం. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు బరువు తగ్గడం చాలా ఆందోళన కలిగిస్తుందని నిపుణులు అంటున్నారు. పిల్లలకు ఈ లక్షణాలు కనిపిస్తే, వెంటనే అప్రమత్తంగా ఉండటం ఉత్తమం. ఇంకా, సమీపంలోని వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## కేలరీలను ఎలా బర్న్ చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో చాలా మంది ఎదుర్కొంటున్న సమస్య ఊబకాయం లేదా అధిక బరువు. చాలా మంది బరువు తగ్గడానికి డైటింగ్, వాకింగ్, యోగా, వ్యాయామం వంటి వివిధ పద్ధతులను ఫాలో అవుతారు. ఈ పద్ధతులన్నీ కేలరీలను బర్న్ చేస్తాయి. అయితే, శరీరం ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తే, బరువు తగ్గడం వేగంగా జరుగుతుందని చాలా మంది నమ్ముతారు. అయితే, బరువు తగ్గడానికి ఇది ఆరోగ్యకరమైన మార్గం కాదు. ఒక రోజులో ఎక్కువ కేలరీలను బర్న్ చేయడం వల్ల ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు ఉంటాయి. మీరు ఆరోగ్యకరమైన రీతిలో బరువు తగ్గాలనుకుంటే, మీరు పరిమిత సంఖ్యలో కేలరీలను బర్న్ చేయాలి. ఎక్కువ కేలరీలను బర్న్ చేయడం శరీరానికి హానికరం. అందువల్ల, మీరు ఒక రోజులో ఎన్ని కేలరీలను బర్న్ చేయాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం.



**కేలరీలను ఎలా బర్న్ చేయాలి?**

నిపుణుల ప్రకారం, మీరు రోజుకు 300 నుండి 500 కేలరీలు బర్న్ చేయాలి.

దాదాపు 40 నిమిషాలు క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి

గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ తాగడం అలవాటు చేసుకోండి.

ఒకేసారి ఏదైనా సరే అధికంగా తినకండి.

క్రమం తప్పకుండా అల్పాహారం తినండి. తక్కువ కొవ్వు ఉన్న ఆహారం తినండి.

తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. నిపుణులు రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగాలని సిఫార్సు చేస్తున్నారు.

**ఈ విధంగా కూడా కేలరీలను బర్న్ చేయవచ్చు.!**

చాలా మంది కేలరీలు బర్న్ చేయడానికి జిమ్‌కు వెళతారు. కొందరు కఠినమైన వ్యాయామం కూడా చేస్తారు. అయితే, మీరు సరదా కార్యకలాపాలు చేయడం ద్వారా కూడా కేలరీలను బర్న్ చేయవచ్చు. ఇంటి పనులు చేయడం, ఊడ్చడం, తుడవడం, బట్టలు ఉతకడం ద్వారా మీరు కేలరీలను బర్న్ చేయవచ్చు. మీరు నృత్యం చేయడం ద్వారా కూడా కేలరీలను బర్న్ చేయవచ్చు. మీ భాగస్వామి, పిల్లలు లేదా కుటుంబ సభ్యులతో కాసేపు డ్యాన్స్ చేయడం ద్వారా మీరు కేలరీలను బర్న్ చేయవచ్చు. డ్యాన్స్ కేలరీలను బర్న్ చేయడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.

షాపింగ్ కూడా కేలరీలను బర్న్ చేస్తుంది. షాపింగ్ చేసేటప్పుడు ప్రజలు చాలా నడుస్తారు. ఇది కేలరీలను బర్న్ చేస్తుంది. బరువు తగ్గడానికి కేలరీలు బర్న్ చేయడం చాలా అవసరం. మీరు అధిక కొవ్వు ఉన్న ఆహారాన్ని తింటే, మీరు ఎక్కువ కేలరీలు బర్న్ చేయాల్సి ఉంటుంది. కానీ రోజుకు 500 కేలరీలు మించకూడదని గుర్తుంచుకోండి. ఇది మిమ్మల్ని శారీరకంగా బలహీనపరుస్తుంది. ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తుంది.

## ఉదయం గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగితే ఎన్ని లాభాలో తెలుసా?

నెయ్యి ఆరోగ్యానికి చాలా మంచిదని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అయితే, చాలా మంది నెయ్యి తినడం వల్ల బరువు పెరుగుతారనే భయంతో తినరు. అయితే, మితంగా నెయ్యి తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

నిపుణుల ప్రకారం, నెయ్యి మెదడును ఉత్తేజపరుస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నెయ్యి ఆహార రుచిని పెంచడమే కాకుండా గణనీయమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. నెయ్యిలో విటమిన్లు %ూ, ఇ, జు, ఖ%, అలాగే శరీరానికి మేలు చేసే భాస్వరం, మెగ్నీషియం, కాల్షియం, ఇనుము వంటి పోషకాలు ఉంటాయి.



క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. కానీ ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల కూడా అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని మీకు తెలుసా? ఇది ఆరోగ్యం, శ్రేయస్సుకు దివ్యౌషధం. ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం..

**జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది:**

మీకు తరచుగా కడుపు సమస్యలు ఉంటే, ప్రతిరోజూ ఉదయం ఒక చెంచా నెయ్యిని గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం అలవాటు చేసుకోండి. ఇది పేగులను శుభ్రపరుస్తుంది, జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. గోరువెచ్చని నీటితో నెయ్యి కలిపి తాగడం వల్ల అసిడిటీ, మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది.


**కీళ్ల నొప్పులతో**

ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇది కీళ్లను బలపరుస్తుంది.

# ఎక్కువ శాతం మందికి బాత్ రూమ్‌లోనే ఎందుకు హార్ట్ ఎటాక్‌లు వస్తాయి..?

## అలా జరగకుండా ఉండాలంటే ఏం చేయాలి..?

నిత్యం ఉరుకుల పరుగుల బిజీ జీవితం కారణంగా చాలా మంది రోజూ అనేక సందర్భాల్లో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారు. ఈ కారణంగా చాలా మంది గుండె పోటుతో అకస్మాత్తుగా మృతి చెందుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం మంది గుండె జబ్బుల కారణంగా మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఎక్కువ శాతం మందికి హార్ట్ ఎటాక్ వస్తుండగా, అది కూడా వారు బాత్ రూమ్‌లో ఉండగానే అలా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. చాలా మందికి బాత్ రూమ్‌లలోనే హార్ట్ ఎటాక్ వస్తుందని అంటున్నారు. అయితే దీని వెనుక బలమైన కారణాలే ఉంటున్నాయని, వీటిని గమనించి జాగ్రత్తగా ఉంటే హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



**కారణాలు ఇవే..**

సాధారణంగా బాత్ రూమ్‌లో మల విసర్జన చేసినప్పుడు లేదా మూత్ర విసర్జన చేసినప్పుడు శరీరంపై కొన్నిసార్లు ఒత్తిడి బాగా పడుతుంది. అయితే అలాంటప్పుడు గుండె కొట్టుకునే వేగంలో మార్పులు వస్తాయి. దీని వల్ల ఒక్కసారిగా గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. దీంతో హార్ట్ ఎటాక్ వస్తుంది. బాత్‌రూమ్‌లో హార్ట్ ఎటాక్ వచ్చేందుకు ఇదొక కారణంగా చెప్పవచ్చు. అలాగే కొందరు మలం లేదా మూత్ర విసర్జన చేసేటప్పుడు శరీరంపై బాగా ఒత్తిడిని కలగజేస్తారు. మల విసర్జన చేసినప్పుడు బాగా ఒత్తిడితో చేస్తారు. అలాగే ఎక్కువ సేపు మూత్రాన్ని ఆపుకున్నా కూడా విసర్జించేటప్పుడు బాగా ఒత్తిడిని కలగజేస్తారు. దీని వల్ల వేగస్ నాడిపై ఒత్తిడి పడి భారం పెరుగుతుంది. ఇది గుండె కొట్టుకునే వేగాన్ని గణనీయంగా పెంచుతుంది. దీంతో హార్ట్ ఎటాక్ సంభవిస్తుంది.

**ఇవి కూడా కారణమవుతాయి..**

ఇక కొందరు మరీ చల్లగా లేదా మరీ వేడిగా ఉండే నీటితో స్నానం చేస్తుంటారు. ఇలా చేయడం మంచిది కాదు. దీనివల్ల శరీర ఉష్ణోగ్రతలో ఒక్కసారిగా భారీ మార్పులు వస్తాయి. దీని వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఇది హార్ట్ ఎటాక్‌కు కారణమవుతుంది. కనుక ఈ పరిస్థితి రాకుండా ఉండేందుకు గాను గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. అలాగే కొందరు బెడ్ మీద నుంచి లేచి వెంటనే హడావిడిగా బాత్‌రూమ్‌కు పరుగెత్తుతారు. కానీ ఇలా చేయడం వల్ల ఒత్తిడి ఒక్కసారిగా పెరుగుతుంది. దీని వల్ల కూడా గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఫలితంగా అది హార్ట్ ఎటాక్ కు దారి తీస్తుంది. కనుక బెడ్ మీద నుంచి లేచిన తరువాత వెంటనే కిందకు దిగకూడదు. నెమ్మదిగా పనులు చేసుకోవాలి. దీంతో హార్ట్ ఎటాక్ లు రాకుండా నివారించవచ్చు.

**ఈ విధంగా చేయండి..**

బాత్ రూమ్‌లో మూత్రం లేదా మల విసర్జన చేసేటప్పుడు ఎక్కువ ఒత్తిడి కలగజేయకూడదు. అలాగే మలం, మూత్రాన్ని ఎక్కువ సేపు బంధించకూడదు. ఇది గుండెపై భారం పడేయడం మాత్రమే కాదు, కిడ్నీలపై కూడా భారం కలిగేలా చేస్తుంది. దీని వల్ల మూత్రాశయ వ్యవస్థ కూడా దెబ్బ తింటుంది. కనుక మలమూత్రాలను ఎక్కువ సమయంపాటు బంధించి ఉంచకూడదు. అలాగే స్నానం చేసేటప్పుడు కాస్త గోరు వెచ్చగా ఉన్న నీటితోనే స్నానం చేయాలి. మరీ చల్లగా లేదా మరీ వేడిగా ఉన్న నీళ్లను స్నానానికి ఉపయోగించకూడదు. అలాగే తలస్నానం చేసేటప్పుడు ముందుగా నీళ్లను తలపై కాకుండా కొన్ని నీళ్లను పాదాలపై పోసుకోవాలి. తరువాత నీళ్లను తలపై పోసుకుని స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల బాత్ రూమ్‌లో హార్ట్ ఎటాక్‌లు రాకుండా అడ్డుకోవచ్చు. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# రాత్రి పూట నిద్రలో దంతాలను కొరుకుతున్నారా..?

## అయితే అలా ఎందుకు చేస్తారు..? దాన్ని ఎలా తగ్గించుకోవాలి..?



చాలా మంది నిద్రించేటప్పుడు వివిధ రకాల భంగిమల్లో బెడ్‌పై పడుకుంటారు. గాఢ నిద్రలో ఉన్నా కూడా రకరకాల భంగిమల్లో నిద్రిస్తుంటారు. ఎవరి సౌకర్యానికి తగినట్లు వారు అలా చేస్తారు. అయితే కొందరు నిద్రలో ఉన్నప్పుడు దంతాలను కొరుకుతారు. ముఖ్యంగా పిల్లలు ఈ విధంగా ఎక్కువగా చేస్తారు. దీని వల్ల వారు నిద్రించేటప్పుడు దంతాలను కొరికితే ఆ శబ్దం బయటకు వినిపిస్తుంది. కానీ పిల్లలు లేదా పెద్దలు ఎవరైనా సరే దంతాలను కొరికితే అలా చేస్తున్నట్లు వారికి తెలియదు. కానీ పక్కన ఉన్న వారికి మాత్రం ఆ శబ్దం స్పష్టంగా వినిపిస్తుంది. అయితే ఎవరైనా ఇలా ఎందుకు చేస్తారు.. అనే విషయంపై ఇప్పటికీ వైద్య నిపుణులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. కానీ ఇందుకు పలు కారణాలు ఉంటాయని మాత్రం వారు చెబుతున్నారు.

**పెద్దలు, పిల్లలు..**

సాధారణంగా పెద్దల్లో ప్రస్తుతం ఆందోళన, ఒత్తిడి, కోపం, నిరాశ, ఉద్రిక్తత అధికంగా ఉంటున్నాయి. అందుకు అనేక అంశాలు కారణం అవుతున్నాయి. అయితే ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నవారు నిద్రలో దంతాలను అధికంగా కొరుకుతారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే మానసిక సమస్యలు మరీ తీవ్రంగా ఉన్నవారు కూడా నిద్రలో ఇలాగే చేస్తారని అంటున్నారు. ఇక చిన్నారులు మాత్రం దంతాలను కొరికేందుకు వేరే కారణాలు ఉంటాయి. చిన్నారుల పేగులు లేదా జీర్ణాశయంలో పురుగులు ఎక్కువగా ఉన్నా, వారిలో క్యాల్షియం, మెగ్నిషియం వంటి లోపాలు ఉన్నా అలాంటి వారు నిద్రలో దంతాలను కొరుకుతారని వైద్య నిపుణులు చెబుతున్నారు. కనుక చిన్నారులకు ఈ సమస్య తగ్గేందుకు గాను వారికి రోజూ పౌష్టికాహారం ఇస్తే సరిపోతుంది. అదే వారి జీర్ణవ్యవస్థలో పురుగులు ఉంటే మాత్రం వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది.

**వీటిని తినాలి..**

నిద్రలో దంతాలను కొరికే పెద్దలకు ప్రత్యేకంగా చికిత్స అంటూ ఏమీ ఉండదు. కానీ ఈ సమస్యకు కారణం అయ్యే అంశాల పట్ల దృష్టి సారించాల్సి ఉంటుంది. అంటే వారికి ఉండే ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. దీని వల్ల నిద్రలో దంతాలను కొరికే సమస్య నుంచి బయట పడవచ్చు. అలాగే మెగ్నిషియం అధికంగా ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. మెగ్నిషియం మనకు ఎక్కువగా పొద్దు తిరుగుడు విత్తనాలు, గుమ్మడి విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్, బాదంపప్పు, నువ్వులు, ఓట్స్, జీడిపప్పు, పిస్తా, పల్లీలు, అరటి పండ్లు వంటి ఆహారాల్లో లభిస్తుంది. కనుక వీటిని తరచూ తింటే మెగ్నిషియం సమృద్ధిగా లభించి ఆ సమస్య తగ్గుతుంది.

**ఈ చిట్కాలు కూడా పనిచేస్తాయి..**

ఇక నిద్రలో దంతాలను కొరికే సమస్య ఉన్నవారు రాత్రి పూట పాలలో పసుపు లేదా మిరియాల పొడి కలిపి తాగుతుంటే ఉపయోగం ఉంటుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కొందరు రాత్రి పూట చలికి వణికినట్లు ఫీలవుతారు. అలాగే చలికాలంలోనూ అలాంటి వారికి రాత్రి పూట వణుకు ఉంటుంది. ఈ కారణంగా కూడా కొందరు నిద్రలో దంతాలను కొరుకుతారని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కనుక చుట్టూ ఉండే పరిసరాలను వేడిగా ఉంచుకోవాలి.

ఇందుకు అవసరం అయితే రూమ్ హీటర్లను వాడవచ్చు. లేదా శరీరాన్ని వెచ్చగా ఉంచే ఆహారాలను తినాలి. అలాగే రోజుకు 2 సార్లు ఏవైనా హెర్బల్ టీలను తాగుతున్నా ఉపయోగం ఉంటుంది. దీంతోపాటు యోగా, ధ్యానం వంటివి అనుసరించినా కూడా ఈ సమస్య నుంచి బయట పడవచ్చు.

# రోజులో డ్రై ఫ్రూట్స్ ను అసలు ఏ సమయంలో తినాలి..?

## ఎప్పుడు వీటిని తింటే మనకు ఎక్కువ మేలు జరుగుతుంది..?

మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచడం కోసం అనేక రకాల పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో డ్రై ఫ్రూట్స్ కూడా ఒకటి. కిస్మిస్‌లు, అంజీర్, ఆలుబుఖర వంటివి డ్రై ఫ్రూట్స్ జాబితాకు చెందుతాయి. అంజీర్, ఆలుబుఖరతోపాటు యాప్రికాట్స్ కూడా మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక డ్రై ఫ్రూట్స్‌ను చాలా మంది తింటుంటారు. డ్రై ఫ్రూట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. పలు వ్యాధులను నయం చేయడంలోనూ డ్రై ఫ్రూట్స్ మనకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను రోజులో అసలు ఏ సమయంలో తినాలి..? ఎప్పుడు వీటిని తింటే మనకు అధిక శాతం లాభాలు కలుగుతాయి..? అని చాలా మందికి ప్రశ్నలు తలెత్తుతుంటాయి. ఇక ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

**ఏ సమయంలో తినాలి..?**

డ్రై ఫ్రూట్స్ లలో మన శరీరానికి కావల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సితోపాటు పొటాషియం, మెగ్నిషియం, జింక్ వంటి మినరల్స్‌ను మనం డ్రై ఫ్రూట్స్ ద్వారా పొందవచ్చు. ఈ క్రమంలో ఈ పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను ఉదయం తింటేనే అధిక మొత్తంలో లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం వీటిని బ్రేక్ ఫాస్ట్ తోపాటు కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. దీని వల్ల అధిక మొత్తంలో పోషకాలు, ఆరోగ్యకర ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

**రోజంతా యాక్టివ్‌గా..**

రాత్రంతా మన శరీరానికి ఎలాంటి ఆహారం లభించదు. సుమారుగా 10 నుంచి 14 గంటల పాటు శరీరం ఉపవాస దశలో ఉంటుంది. కనుక ఉదయం పూట శరీరానికి పెద్ద ఎత్తున శక్తి అవసరం అవుతుంది. ఈ క్రమంలో డ్రై ఫ్రూట్స్ ను తినడం వల్ల ఆ శక్తిని చాలా వరకు భర్తీ చేయవచ్చు. పైగా ఉదయం నుంచి మనం పనుల్లో యాక్టివ్‌గా ఉంటాం. కొందరు శారీరక శ్రమ కూడా చేస్తుంటారు. కనుక ఉదయం మన శరీరానికి శక్తి అధికంగా అవసరం అవుతుంది. ఇలాంటి సమయంలో డ్రై ఫ్రూట్స్ ను తింటే కావల్సినంత శక్తి లభిస్తుంది. దీంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ధకం పోతుంది. కనుక డ్రై ఫ్రూట్స్ ను ఉదయం పూట తింటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

**ఇలా కూడా చేయవచ్చు..**

అయితే ఉదయం పూట డ్రై ఫ్రూట్స్ ను తినేంత సమయం లేదని భావిస్తే వాటిని మీరు బాక్స్ లో పెట్టుకుని ఆఫీస్‌కు తీసుకెళ్లి తరువాత తినవచ్చు. ఇక అలా కూడా వీలు కావడం లేదని అనుకుంటే సాయంత్రం సమయంలో స్నాక్స్ రూపంలో తినాలి. కానీ ఆ సమయంలో మనకు పెద్దగా శక్తి అవసరం ఉండదు. కనుక డ్రై ఫ్రూట్స్ ను మోతాదుకు కాస్త తక్కువగా తినాలి. ఇలా డ్రై ఫ్రూట్స్ ను తింటే మన శరీరంలో శక్తి స్థాయిలు ఎల్లప్పుడూ అధికంగానే ఉంటాయి. దీంతో నీరసం, అలసట అసలు రావు. ఉత్సాహంగా ఉండి చురుగ్గా పనిచేస్తారు. డ్రై ఫ్రూట్స్ ను ఇలా తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.





# క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్..

## తొలి రౌండ్‌లోనే సింధు, ప్రణయ్ ఇంటికి..!



భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి అదుర్స్ అనిపించాడు. ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో సీనియర్లు తేలిపోగా.. ఈ కుర్రాడు మాత్రం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం చీ యు జెన్(చైనీస్ తైపీ)ను చిత్తు చేసిన ఆయుశ్ టైటిల్‌పై ఆశలు రేపుతూ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌హెచ్ ప్రణయ్ చేతెలెత్తేయగా.. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు సైతం మొదటి రౌండ్‌లో ఓటమితో ఇంటిదారి పట్టింది. చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదు-రయ్యాయి. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు తొలి రౌండ్‌లో, హెచ్ఎస్ ప్రణయ్ క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించారు.

# అగ్రస్థానానికి వైశాలి..

## క్యాండిడేట్స్ చెస్ టోర్నీ



**సైప్రస్:** ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. బుధవారం జరిగిన తొమ్మిదో రౌండ్ పోరులో వైశాలి 1-0 తేడాతో భారత్‌కే చెందిన ప్రపంచ చాంపియన్ దివ్యాదేశ్‌ముఖ్‌పై విజయం సాధించింది. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో వైశాలిదే పైచేయి అయ్యింది. ఈ విజయంతో తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి వైశాలి 5.5 పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. వైశాలితో పాటు జు జినర్(చైనా) సంయుక్తంగా టాప్‌లో ఉంది. మరోవైపు ఓపెన్ విభాగంలో వీ యి(చైనా)తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను ఆర్ ప్రజ్ఞానంద డ్రాగా ముగించుకున్నాడు. విజయం కోసం ఇరువురు ప్లేయర్లు కడదాకా హోరాహోరీగా పోరాడారు. ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో కొనసాగుతుండగా, జావోకిర్ సింద్రోవ్ 6.5 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు.

# షూటర్లకు నిరాశ



**గ్రానడా (స్పెయిన్):** ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్, పిస్టల్ షూటింగ్ వరల్డ్ కప్‌లో తొలిరోజే పసిడి పతకంతో బోణీ కొట్టిన భారత్‌కు రెండో రోజు నిరాశ ఎదురైంది. పురుషుల పది మీటర్ల ఎయిర్‌పిస్టల్ క్వాలిఫికేషన్ బరిలో నిలిచిన ముగ్గురు షూటర్లు.. టాప్-8 ర్యాంకును దక్కించుకున్నవారు పాల్గొనే ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. మంగళవారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో పాలక్‌తో కలిసి స్వర్ణం గెలిచిన ఆంధ్రప్రదేశ్ కుర్రాడు ముకేశ్.. అర్హత రౌండ్లలో 579 పాయింట్లు స్కోరు చేసి 14వ స్థానంలో నిలిచాడు. భరద్వాజ్ ఆకాశ్ పదో స్థానం (580), మాలిక్ ఉజ్వల్ (577) 22వ స్థానంలో నిలిచాడు.



# సూపర్ ఛేజింగ్

## నైట్ రైడర్స్‌పై లక్నో గెలుపు సూపర్ విక్టరీ

- భారీ స్కోరు చేసినా కాపాడుకోలేకపోయిన బౌలర్లు
- గెలుపు ముంగిట కోల్‌కతా బోల్తా
- ఫలించని బౌలర్ సునీల్ వ్యూహం



**కోల్‌కతా, ఏప్రిల్ 9:** ఐపీఎల్ టోర్నీలో భాగంగా గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఆఖరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో లక్నో జట్టు 3 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో లక్నో జట్టు 7 వికెట్లు కోల్పోయి ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది.





### కోల్‌కతా బ్యాటింగ్ తీరు

ముందుగా బ్యాటింగ్ చేపట్టిన కోల్‌కతా బ్యాటర్లు సమష్టిగా రాణించారు. అంగ్క్రిష్ రఘువంశీ 33 బంతుల్లో 45 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అజింక్య రహానే 24 బంతుల్లో 41 పరుగులతో అద్భుత ప్రదర్శన చేశాడు. చివర్లో రోవ్‌మన్ పావెల్ కేవలం 24 బంతుల్లోనే అజేయంగా 3గీ పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరును అందించాడు. లక్నో బౌలర్లలో దిగ్వేష్ రాఠీ, ఎం సిద్దార్థ్, ఆవేశ్ ఖాన్ తలా ఒక వికెట్ పడగొట్టారు. కోల్‌కతా బ్యాటర్లు నిలకడగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు.

### అదరగొట్టిన లక్నో బ్యాటర్లు

182 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో జట్టుకు మిడిలార్డర్ బ్యాటర్లు అండగా నిలిచారు. ముఖ్యంగా ఎం చౌదరి 27 బంతుల్లో అజేయంగా 54 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆయుష్ బదోని సైతం 34 బంతుల్లో 54 పరుగులతో రాణించాడు. ఐడెన్ మార్క్రమ్ 15 బంతుల్లో 22 పరుగులు చేశాడు. కోల్‌కతా బౌలర్లలో అనుకూల్ రాయ్ 2, వైభవ్ అరోరా 2 వికెట్లు పడగొట్టగా సునీల్ నరైన్ ఒక వికెట్ తీశాడు. చివర్లో మ్యాచ్ ఉత్కంఠగా మారినా చౌదరి అద్భుత బ్యాటింగ్‌తో లక్నోకు సంచలన విజయాన్ని అందించాడు.

# తొలి టైటిల్ కోసం ఎదురుచూపులు

- ఆర్సీబీనే కాదు, చెన్నై-ముంబైకి తప్పని నిరీక్షణ!
- అత్యంత ప్రజాదరణ పొందిన టీ20 లీగ్ ఐపీఎల్
- 45 రోజుల్లోనే టైటిల్‌ను కైవసం చేసుకున్న రాజస్థాన్
- టైటిల్ కోసం చెన్నై-ముంబైకి తప్పని నిరీక్షణ




**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్).. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన టీ20 లీగ్. అలాంటి టాప్ టోర్నీలో ప్రతి ఫ్రాంచైజీ టైటిల్ గెలవాలని చూస్తోంది. ఇందుకోసం ప్రతి జట్టు తీవ్రంగా పోరాడుతుంది. అయితే కొన్ని జట్లు ప్రారంభంలోనే ట్రోఫీని అందుకోగా.. మరికొన్ని జట్లు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఐపీఎల్ చరిత్రలో తొలి టైటిల్ గెలవడానికి జట్లు తీసుకున్న రోజుల సంఖ్య చూస్తే.. ఆసక్తికరమైన గణాంకాలు ఉన్నాయి. ఆ డీటెయిల్స్ ఏంటో ఓసారి చూద్దాం. ఐపీఎల్ తొలి సీజన్ 2008లోనే రాజస్థాన్ రాయల్స్ అద్భుత ప్రదర్శనతో టైటిల్ అందుకుంది. రాజస్థాన్ కేవలం 45 రోజుల్లోనే టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐపీఎల్‌లో కొత్తగా ఎంట్రీ ఇచ్చిన గుజరాత్ టైటాన్స్ కూడా 64 రోజుల్లోనే తమ తొలి ట్రోఫీని అందుకుంది. ఇక డెక్కన్ చార్జర్స్ 401 రోజుల్లో టైటిల్ సాధించింది. ఇక ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్‌కు కూడా కొంత నిరీక్షణ తప్పలేదు. 737 రోజులు తర్వాత చెన్నై తమ తొలి టైటిల్ అందుకుంది. చెన్నై 2008లో ఫైనల్ చేరినా.. ఫైనల్లో ఓడిపోయింది. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ 1153 రోజులు ఎదురుచూసి.. 2016లో ట్రోఫీ గెలుచుకుంది. 2013లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన హైదరాబాద్.. మూడో ఏడాదిలో కప్ అందుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ మొదటి కప్ అందుకోవడానికి 14గీగీ రోజులు పట్టింది. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన ముంబై ఇండియన్స్ కూడా తొలి టైటిల్ కోసం 1864 రోజులు వేచి చూడాల్సి వచ్చింది. టాప్ జట్లకు కూడా ప్రారంభంలో టైటిల్ గెలవడం ఎంత కష్టమో ఈ గణాంకాలు చూస్తే అర్థమవుతుంది. ఈ జాబితాలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం అంటే.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల తర్వాత తొలి ట్రోఫీని అందుకుంది. ఎంతో మంది స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ.. ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. ఎట్టకేలకు 6255 రోజుల తర్వాత తొలి ఐపీఎల్ టైటిల్ కైవసం చేసుకుంది. మొత్తానికి ఈ గణాంకాలు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. ఐపీఎల్‌లో విజయం సాధించడం అంత సులభం కాదు. కొన్ని జట్లు తక్కువ సమయంలోనే చరిత్ర సృష్టిస్తే.. మరికొన్ని జట్లు ఏళ్ల పాటు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇదే ఐపీఎల్ ప్రత్యేకత అని చెప్పాలి.

# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్

అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది.ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరో వైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.






# డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి

కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.



# పెద్దిలో పాట కోసం నాయికాన్వేషణ

రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాలోని ప్రత్యేకగీతాన్ని త్వరలోనే తెరకెక్కించ నున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆ గీతంలో రామ్‌చరణ్‌తో కలిసి ఆడిపాడే కథానాయికని ఎంపిక చేయడంపై చిత్రబృందం దృష్టిపెట్టింది. ఇప్పటికే పలువురు కథానాయికల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా... తెలుగమ్మాయి మానస వారణాసి కూడా ఈ రేసులోకి వచ్చింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఆకట్టుకున్నారు మానస వారణాసి. చిత్రబృందం పరిశీలనలో ఆమె పేరు ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. తుదిదశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా విడుదల తేదీపైన త్వరలోనే స్పష్టత రానుంది.





# నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్

## ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్ నాగచైతన్య 'తండేల్' సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎఔఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి గాను ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ ('కోర్ట్') ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పాలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు.ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు.సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.



# హారర్ కామెడీతో కొరియన్ కనకరాజు

వరుణ్ తేజ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ కథకి ఇండియా - కొరియా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇస్తూ టీమ్ ఫన్నీ వీడియోను విడుదల చేశారు. ఏప్రిల్ 11న ఈ పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సాంగ్స్ 'ఓజీ' స్థాయిలో ఉండాలని తమన్‌తో వరుణ్‌తేజ్ సరదాగా చెప్పారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA, D.NO. 1-86-3/HG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017, RNI Title Code: APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021 E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861
PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M), DIST: KARIMNAGAR: TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO: TELTEL/2006/16536